T.T.D. Religious Publications Series No. 1001
Price :

Published by **Sri L.V. Subrahmanyam,** I.A.S., Executive Officer,
T.T.Devasthanams, Tirupati and Printed at T.T.D. Press, Tirupati.

“తిరుమలక్షేత్రదర్శిని” గ్రంథమాల

# తిరుపతి యాత్ర

– డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ

**తిరుమల తిరుపతి దేవస్థానములు**
**తిరుపతి.**

"తిరుమలక్షేత్రదర్శిని" గ్రంథమాల

# తిరుపతి యాత్ర

**రచన**

**డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ**

ప్రచురణ

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.**

**2013**

# TIRUPATI YATRA

**By**
**K. Aakella Vibheeshana Sharma M.A(Sanskrit), M.A(Telugu), Ph.D**

T.T.D. Religious Publications Series No. 1001

© All Rights Reserved

*First Edition:- 2013*

Copies:

*Published by :*
**L.V. SUBRAHMANYAM**, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

***D.T.P:***
Office of the Editor-in-Chief,
T.T.D, Tirupati.

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517 507

# ముందుమాట

**"వేంకటాద్రిసమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన**
**వేంకటేశసమో దేవో న భూతో న భవిష్యతి"**

వేంకటాద్రికి సమానమైన మరో క్షేత్రం ఈ బ్రహ్మాండంలోనే లేదు. వేంకటేశ్వరునికి సాటి రాగల దేవుడు ఇంతవరకు ఎక్కడా లేడు. ఇక మీదకూడ ఉండడు - అని అర్థం.

కలియుగవైకుంఠంగా భాసిల్లే శ్రీవేంకటాద్రిపై అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీవేంకటేశ్వరస్వామి అవతరించి నిత్యమూ భక్తులకు దర్శనమిస్తూ వారిని తరింపజేస్తున్నాడు. శ్రీవేంకటేశ్వరస్వామి దివ్యమంగళ విగ్రహమూర్తిని ఒక్క క్షణకాలమైనా దర్శించుకొని తరించడానికి వేలకొద్దిమంది భక్తులు నిత్యమూ ఈ క్షేత్రానికి యాత్ర చేస్తుంటారు.

పిలిస్తే పలికే ప్రత్యక్షదైవమూ, కోరిన వరాలరాయుడూ ఐన శ్రీవేంకటేశ్వరస్వామి వెలసిన ఈ క్షేత్రంలోని స్వామి దివ్యమంగళ విగ్రహం, స్వామి పుష్కరిణి, పవిత్రతీర్థాలు, స్వామికి అతివైభవంగా జరిగే నిత్యకైంకర్యాలు, స్వామి బ్రహ్మోత్సవాలు మొదలైన విశేషాలు భక్తులకు తెలియజేయాలనే సంకల్పంతో తిరుమల తిరుపతి దేవస్థానం **'తిరుమల క్షేత్రదర్శిని'** అనే పేర ఒక గ్రంథమాలను ప్రారంభించి, ఆ యా పండితులచేత గ్రంథాలను రాయించి ప్రకటించాలని తలపెట్టింది.

ఈ గ్రంథాలలో ప్రస్తుతం డా॥ ఆకెళ్ళ విభీషణ శర్మగారు రచించిన **'తిరుపతి యాత్ర'** అన్న ఈ గ్రంథాన్ని భక్తులకు అందజేస్తున్నాము. భక్తు లీ

గ్రంథం ద్వారా తిరుమల యాత్రావిధానాన్ని నియమాలను గూర్చి వివరంగా తెలుసుకొని ధన్యత నొందుదురుగాక అని ఆకాంక్షిస్తున్నాము.

సదా శ్రీవారి సేవలో....

కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

# విషయసూచిక


| | |
|---|---|
| యాత్ర– నిఘంటువులలోని అర్థాలు–యాత్రల రకాలు | 1 |
| తిరుపతి తిరుమల శబ్దాలకున్న విస్తృతార్థాలు | 2 |
| ప్రాచీనకాలంలో తిరుమలను దర్శించినవారు | 3 |
| తిరుమలకు వివిధమార్గాలు | 7 |
| తమిళుల తిరుమల యాత్రావిధానం | 9 |
| కన్నడిగుల తిరుమల యాత్రావిధానం | 12 |
| ఆంధ్రుల తిరుమల యాత్రావిధానం | 14 |
| ఔత్తరాహుల తిరుమల యాత్రావిధానం | 19 |
| అలనాటి తిరుమల వాసనియమాలు | 21 |
| తిరుమలకొండ ప్రాధాన్యం | 24 |
| తిరుపతి తిరుమల యాత్రలో మజిలీలు | 26 |
| తిరుమలలో యాత్రాక్రమం | 37 |

## యాత్ర: నిఘంటువులలోని అర్థాలు– యాత్రల రకాలు

'యాత్రా'– ఆకారాంత స్త్రీలింగ సంస్కృత శబ్దం. ఈ శబ్దానికి నిఘంటువులు పోవడం, పుణ్యక్షేత్రాలకు తరలివెళ్ళడం, కాలం వెళ్ళబుచ్చడం, జాతర అనే అర్థాలను సూచించాయి. పురాణ, ఇతిహాస వాఙ్మయం పరిశీలిస్తే వాటిలో చక్రవర్తుల లేదా రాజుల లేదా క్షత్రియుల జైత్రయాత్రలు, యాగాశ్వ సంరక్షణయాత్రలు, ఘోషయాత్రలు కనిపిస్తాయి. అలాగే అరుదుగా ఒక తెగవారు నిర్దిష్ట ప్రయోజనార్థం కొండదగ్గరికో లేదా సముద్రతీరానికో లేదా వనాలకో వెళ్ళడం భారత, భాగవతాదులలో కన్పించే అంశం. అలాగే నేటి అగ్రవర్ణుల వివాహాలలో 'కాశీయాత్ర' ఒక తంతుగా నిలిచిపోయినా అది విద్యాయాత్ర అవుతుంది. ప్రాచీనకాలంలో కవులు, కళాకారులు, పండితులు, శాస్త్రజ్ఞులు తమ విద్యాపాటవ ప్రావీణ్యం స్థిరపరచుకోవడానికి శిష్యబృందంతో యాత్రగా కదలి వెళ్ళేవారు. నేటి వ్యవహారంలో యాత్రలు అనేకరకాలుగా ఉన్నాయి. విహారయాత్ర, వినోదయాత్ర, విజ్ఞానయాత్ర, సాహసయాత్ర, అంతరిక్షయాత్ర, శాంతియాత్ర, తీర్థయాత్ర, క్షేత్రయాత్రలనీ అనేక రకాలుగా వింటున్నాము. వీటితోబాటు అమంగళమైన, కొన్నిటిని 'యాత్రా' శబ్దంతో జోడించి వ్యవహరించడం కూడా లేకపోలేదు. ప్రస్తుతం పాదయాత్ర, ఓదార్పుయాత్రలు వింటున్నాం.

యాత్రలెన్ని రకాలైనా 'తీర్థయాత్ర, క్షేత్రయాత్ర'లు పుణ్యప్రదాలు. వీటికి బహుళార్థక ప్రయోజనాలున్నాయి. అందుకే భారతీయులు పురాణాలలో ఇటువంటి యాత్రలను పదేపదే స్మరించారు, ఆచరించమని ప్రబోధించారు. అనంత పుణ్యప్రదమనీ ఎలుగెత్తి చాటినారు. ఇహపర సాధకమనీ నొక్కి చెప్పారు. ఈ యాత్రలు ఇతర మతస్థులకు కూడా లేకపోలేదు. హజ్‌యాత్ర, జెరుసలెంయాత్ర లాంటివి. హైందవులలో మానససరోవర యాత్ర చాల ప్రసిద్ధమయింది. అయినా తీర్థయాత్ర, క్షేత్రయాత్రలనడం పరిపాటి.

భారతదేశంలో శైవం, వైష్ణవం, శాక్తేయం ప్రధాన హైందవ శాఖలు. ఈ శాఖలకి తగినట్లుగా ఆచారాలూ, సంప్రదాయాలూ, దర్శనీయ స్థలాలూ అనేక

రూపాలలో కనబడుతున్నాయి. వాటిలో శ్రీవైష్ణవం అనేక కారణాలవల్ల ప్రజాభిమానం చూరగొన్నది. ఆ శ్రీవైష్ణవం 108 దివ్య క్షేత్రాల సందర్శనకు ప్రాధాన్యమిస్తుంది. వైష్ణవానికి ఆయువుపట్టైన నాలాయిరంలో 108 దివ్యక్షేత్రాల పాశురాలున్నాయి. ఆళ్వారులు మంగళాశాసనం చేసిన వైష్ణవక్షేత్రాలే "తిరుపతులు" అనబడుతాయి. వాటిలో కేవలం రెండు మాత్రం తిరుపతి తిరుమల, అహోబలం ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయి.

**తిరుపతి తిరుమల శబ్దాలకున్న విస్తృతార్థాలు:**

తిరుపతి తిరుమల ఈ రెండు శబ్దాలలోని 'తిరు' తమిళ శబ్దమౌతుంది. తమిళనాడులో చాలా ఊర్లపేర్లు 'తిరు' పూర్వకాలే–తిరునెల్వేలి, తిరుచినాపల్లి, తిరువల్లిక్కేని, తిరునింద్రవూర్ మొదలైనవి. అలాగే వ్యక్తుల గౌరవాన్ని సూచించేవేళ 'తిరు' చేర్చడం తమిళ సంప్రదాయం ప్రత్యేకించి వైష్ణవుల్లో 'తిరు' శబ్ద వ్యాప్తి ఎక్కువ–తిరుమేని, తిరుమాడవీధి, తిరుప్పళ్లియెళ్లుచి, తిరుమంజనం లాంటివి.

తిరుపతి 'శ్రీపతిని' స్పష్టం చేస్తుంది. మహావిష్ణువే శ్రీపతి. లక్ష్మీనాథుడయిన మహావిష్ణువు అర్చామూర్తిగా వెలసిన స్థలాలన్నీ తిరుపతులే. కానీ తమిళనాడులో కొన్ని పుణ్యక్షేత్రాల పేర్లను చెప్పినపుడు తిరుపతి అనే మాటను జతచేసి చెప్పడం లేదు. శ్రీరంగం అంటారు కానీ శ్రీరంగంతిరుపతి అనరు. శ్రీవిల్లిపుత్తూరు అంటారు గానీ తిరుపతి అని చేర్చి పలకరు. ఈ పేచీ ఆంధ్రప్రదేశ్ చిత్తూరు జిల్లాలోని తిరుపతికి లేదు. ఏ శబ్దాన్ని ముందుగానీ వెనుకగానీ చేర్చవలసిన అవసరం లేని సమాసంగా తిరుపతి ఉంది.

ప్రాచీనకాలంలో తిరుమల అనే శబ్దానికే ప్రాధాన్యం. 'మల' అంటే కొండ. తిరు పవిత్రవాచకంకాగా తిరుమల పవిత్ర పర్వతమైంది. ఆళ్వారులలో ఒకరైన పేయాళ్వార్ "శూwo తిరుఞ్ఞ అరువి పాయుమ్ తిరుమలై మేల్" చుట్టి పారుచూ సమృద్ధములైన సెలయేళ్ళు ప్రవహించు తిరుమలై మీద వేంచేసిన స్వామికి అని 'తిరుమల' శబ్దాన్ని వాడారు. క్రమంగా తిరువేంగడం అనడాన్ని ఆళ్వారులందరూ పేర్కొని స్వామిని స్తుతించారు. అయితే ఈ పురానికి



ప్రాచీనకాలంలో గోవిందరాజపట్టణం, అచ్యుతరాయపురం, కొత్తూరు అనే వ్యవహారనామాలుండేవి.

తెలుగులో ఎఱ్ఱన 'వేంకటాచలస్థాయి గొలిచి అని 'వేంకట' శబ్దానికే ప్రాధాన్యమిచ్చాడు. శ్రీనాథుడు కాశీఖండంలో శ్రీశైల' వేంకట అహోబల శోణాద్రి సాలగ్రామాది పర్వతాలను ఉట్టంకించాడు. తాళ్ళపాకవారి కాలం నాటికి దిగువ తిరుపతి, ఎగువ తిరుపతి అనేవారేమో. అయినా కీర్తనలలో కొన్నిచోట్ల ఏకార్థం వచ్చేలా వాడారు. మరికొన్నిచోట్ల విడివిడిగా వాడారు. సందర్భాన్ని బట్టి ఆయా ప్రదేశాలను అన్వయించుకోవాలి

శ్రీపతి పురనాయకా!

రామకు తిరుపతి రాముడే మందు

శ్రీవేంకటాద్రి తిరుపతి లోపలను

అలాగే కన్నడ హరిదాసులు కూడా తిరుమల తిరుపతి వాసా, కండె తిరుపతి వెంకటరమణ అని తాళ్ళపాకవారి వలె అనేక దేవరనామగళులో సన్నుతించారు. ఏది ఏమైనా క్షేత్ర, తీర్థ దైవత ప్రాధాన్యంగల పవిత్రప్రదేశం తిరుమల.

**ప్రాచీనకాలంలో తిరుమలను దర్శించినవారు:**

ఋగ్వేదంలో వేంకటాచల మహిమను తెలిపే సూక్తాలు కొన్ని ఉన్నాయి. వాటిలో ప్రసిద్ధమైనది

**అరాయి! కాణే! వికటే గిరిం గచ్ఛ సదాఽన్వే।**
**శిరింబిటస్య సత్త్వభిః తేభిష్ట్వా చాతయామసి॥**

**(ఋగ్వేదం 7-153-8)**

పేదలారా! అంధులారా! ఐశ్వర్యశూన్యులారా, అంగవికలులారా, దీనాతి దీనులగు ఓ ప్రజలారా! వేంకటాచలము వైపు నడువుడు. ఆక్షేత్రమునకు వెళ్ళి అచంచలమైన ధ్యాన యోగానికి సిద్ధము కందు. మహాలక్ష్మికి పీఠస్థానమైన

వేంకటాచలపతి యొక్క సాత్త్విక, దయా, వాత్సల్యాది దివ్య కళ్యాణ గుణాదుల కారణంగా మీ పాపాలు దహింపబడతాయి అని సూచితం.

ఎఱ్రన హరివంశంలో గాలవుడు చేసిన యాత్రా క్రమంలో తిరుమల స్పష్టంగా పేర్కొనబడింది. వేంకటాచల మాహాత్మ్యమును బట్టి-దశరథమహారాజు కూడా తిరుమలను సందర్శించి స్వామిని స్తుతించి పుత్ర సంతానం కోరినట్లు వర్ణనలు ఉన్నాయి. అలాగే శ్రీరాముడు కూడా వేంకటాద్రికి విచ్చేసినట్టు ఆధారాలున్నాయి. ఆంజనేయస్వామి జననం తిరుమల మీదనే కావడం వల్ల 'అంజనాద్రి' అనే పేరు స్థిరపడినట్టు ఐతిహ్యం. వీరే కాక మార్కండేయాదులు, భాగవతంలోని బలభద్రుడు స్వామిని కీర్తించినట్టు పౌరాణిక ఆధారాలున్నాయి. వీరందరు పురాణపురుషులు. ఈ సందర్భంలో తాళ్ళపాక అన్నమాచార్యుల సంకీర్తన పరిశీలించదగ్గది.

**ఇల సప్తఋషులు వెదకి ప్రదక్షిణము**
**లలరఁజేసిన దేవుఁడాతఁడితఁడె**
**నెలవై కోనేటి పొంత నిత్యముఁగుమారస్వామి**
**కలిమిఁదపము సేసి కన్న దేవుఁడితఁడె**

**యెక్కువై బ్రహ్మాదులు నెప్పుడు నింద్రాదులు**
**తక్కక కొలిచియున్న తత్త్వమీతఁడె**
**చక్క నారదాదుల సంకీర్తనకుఁజొక్కి**
**నిక్కిన శ్రీవేంకటాద్రి నిలయుండు నితఁడె**

తిరుమలేశుని, పాశురాలతో ప్రశంసించి స్వామి ప్రసిద్ధికి కారణమైనవారు పదిమంది ఆళ్వారులు. వారి పాటలు తమిళం కావడం విశేషం. ఆళ్వారులు తిరుపతికి విచ్చేసి 'అడివారము' లోనే (కొండ దిగువభాగం) నిలబడి కొండను, స్వామిని సంస్తుతించారని ఒకవాదము. మరికొందరు ఆళ్వారులు కొండెక్కి తిరుమల చేరి అక్కడి ప్రకృతి దృశ్యాలకు పరవశించి పరమాత్ముని కీర్తించారని ఇంకొక వాదము. మరికొందరు ఆళ్వారులు తిరుపతికే రాలేదనీ, వారి ఎదుట ఆయా దివ్యతిరుపతులు సాక్షాత్కరించాయని విశదం చేస్తున్నారు. ఇందుకు



ప్రధానంగా నమ్మాళ్వార్ చింత తొర్రలోనే గడపడాన్ని బలంగా నమ్ముతున్నారు. ఏది ఏమైనా తిరుమల తిరుపతులు తమిళ రాజన్యుల ఏలుబడిలో ఉండటం, సంగసాహిత్యంలో పేర్కొనబడడం తమిళరాజుల కైంకర్యాలు విశేషం కావడం తిరుమల తిరుపతి శాసనాలలో తమిళ శాసనాల ఆధిక్యం ఉండటం కారణంగా తిరుమలకు ప్రాచీనకాలంలో ఎక్కువగా వేంచేసినవారు తమిళులు అనడంలో సందేహం లేదు. అంతేగాక శ్రీవైష్ణవ సంప్రదాయమైన శ్రీమద్రామానుజ సంప్రదాయం విస్తరించాక 'పాంచరాత్రం' (తిరుచానూరులో) పూజావిధానం అమలు పరచబడిన తర్వాత తమిళులరాక అధికమైనదనడం వాస్తవం. తొల్కాప్పియం 'తిరువేంగడాన్ని' తమిళదేశం ఉత్తర ఎల్లగా పేర్కొనింది. ఎవరయినా తమ తమ 'సీమ' ప్రాంతాలలో తమ ఉనికిని అన్నిరకాల కట్టుదిట్టం చేసుకోవడం సహజం.

**కన్నడిగులు-హరిదాసులు:** దక్షిణ భారతదేశంలో కన్నడాంధ్ర ప్రాంతాలకు ఒక విశిష్టత ఉంది. ఒక నదికి రెండు పాయలుగా, ఒక చెట్టుకు రెండు కొమ్మలుగా, ఒక తల్లికి పుట్టిన కవలపిల్లలుగా కన్నడాంధ్రభాషలు చాలా వరకు కలసిమెలసి అభివృద్ధి చెందాయి. ఈ రెండు భాషలు మాటలాడేవారిలో సామ్యత ఎక్కువ. దీనికి తగినట్టుగనే ఆచార వ్యవహారాలూ అలాగేపాలకుల సంబంధాలు శతాబ్దాల తరబడి చెరగకుండా ఉంది. ప్రత్యేకించి విజయనగర సామ్రాజ్యపాలకుల కాలంలో ఆ రాజ్య పాలకులైన సాళ్వ నరసింహరాయ, శ్రీకృష్ణదేవరాయ, అచ్యుత దేవరాయలకాలాల్లో వైష్ణవాభిమానం పెరగడంతో ఈ రెండు ప్రాంతాలవారికి తిరుపతి దర్శనీయ స్థలమైంది. కన్నడిగులు తమ వ్యవహారంలో 'దేవరందరె తిమ్మప్ప'- దేవుడంటే తిరుమల అప్పడనీ స్థిరపడడం దీనికి సూచకం. ఇదేగాక శ్రీపాదరాయ, వ్యాసరాయ, పురందరదాస, కనకదాస, ప్రసన్నవెంకటపతి దాసు మొదలైనవారి దేవర నామగళుపల్లె ప్రజలలో తిరుమల దర్శనానురక్తిని పెంచింది. ఇదే సందర్భంలో తెలుగులో విశిష్టమైన తాళ్ళపాక సాహిత్యం వెలువడడం సుమారు 150 సంవత్సరాలువారి ప్రభావం నిలవడం తెలుగువారిలో వేంకటేశ్వర భక్తిని దీపితం చేసింది. ప్రత్యేకించి ఆలయకవిగా

ఆంధ్రదేశంలోని అనేక వైష్ణవాలయాల సంకీర్తనాచార్యుడిగా మాలిన్యము లేని మహితభక్తితో గావించిన సేవలు కూడా తెలుగువారిని ఆకర్షించాయి. రాయలసీమ వాసులకేగాక ఇతర ఆంధ్ర ప్రాంతాలవారికి కూడా స్వామి సేవ్యమానుడు కావడం విశేషం. ప్రస్తుతం శ్రీవేంకటేశ్వరుడు ఆంధ్రుల ఇష్టదైవంగా కొలువబడడం పరిణామదశలోని ఒక మైలురాయి అనకతప్పదు. కనుకనే తమిళుల తర్వాత తెలుగువారు తిరుపతిని దర్శించుకుంటున్నారు. తమ పిల్లలకు వెంగమాంబ, వెంకటరమణ, వేంకటేశ్వర, శ్రీనివాస, గోవింద, గోవిందమ్మ, ఏడుకొండలు లాంటి పేర్లు పెట్టుకొని నోరారా పిలుచుకుంటున్నారు. అలాగే కవులు, పండితులు, గాయకులు విభిన్న సాహిత్య ప్రక్రియలతో స్వామిని తమ వానిగా భావించి తమ భక్తి విశేషాన్ని ప్రకటిస్తున్నారు.

తిరుపతికి కన్నడిగులు చేసినసేవ మహనీయమైంది. ప్రత్యేకించి హొయసలరాజులు, తుళువ వంశీయులు, మైసూరు మహారాజ పాలకులు సురపుర సంస్థానాదీశులు, యాదవులు అనేక కైంకర్యాలతో తమ భక్తిని శాశ్వతం చేసుకున్నారు. తిరుమల మీద ప్రత్యేకించి 'ఒకరాష్ట్ర' అతిథి భవనము (Mysore choultry) ఉండడం గుర్తించదగ్గ అంశము. తమిళులు, ఆంధ్రుల తర్వాత తిరుపతిని దర్శించి స్వామిని సేవించేవారు కన్నడిగులే.

**తిరుమల ఔత్తరాహులు:** తిరుమలకు విచ్చేసేవారిలో ఔత్తరాహులు కూడా ముఖ్యులే. ఉత్తర భారతదేశంలో భక్తితత్వాన్ని ప్రచారం చేసిన వల్లభాచార్యులువారు తెలుగువారు కావడం విశేషం. అలాగే విజయనగర సామ్రాజ్య పతనానంతరం, మహమ్మదీయుల పాలనానంతరం ఆంగ్లేయుల తూర్పు ఇండియా కంపెనీ పాలనా కాలంలో దేవస్థానం బాధ్యతలు స్వీకరించిన కొందరు మహంతుల నిష్కళంక సేవానిరతివలన శ్రీనివాసభక్తి ఉత్తరదేశానికి ప్రాకడం విశేషం. మహంతులు స్వామిని బాలాజిగా ఔత్తరాహులకు పరిచయం చేశారు. శ్రీవేంకటేశ్వర నామంతో ఈనాడు 'బాలాజీ' అనే పేరు స్థిరపడడం మహంతుల ఫలితమే. ధర్మదాసు, భగవాన్‌దాసు, మహావీర్‌దాసు, ప్రయాగ్‌దాస్ లాంటివారు తిరుమల అభివృద్ధికి పాటుపడడం, ఔత్తరాహుల రాక నిమిత్తంతో



తిరుపతి తిరుమలలో ఉత్తరాది మఠం, రాజస్థానీయ సత్రాలు క్రమంగా పెరిగాయనడం వాస్తవం.

**తిరుమల-ఇతరులు:** తిరుపతికి విచ్చేసేవారిలో మహారాష్ట్ర భక్తులు కూడా ప్రముఖులే. శ్రీవేంకటాచల మాహాత్మ్యం బట్టి లక్ష్మీదేవి కొల్హాపురం చేరడం మహారాష్ట్రులకు భక్తికారకమైంది. అంతేకాక కన్నడ హరిదాసులలో చాలా మంది కర్ణాట మహారాష్ట్ర ప్రాంతాలలోనివారు కావటం మరొక విశేషం. భజన చేసుకుంటూ ఒక క్షేత్రం నుండి ఇంకొక క్షేత్రానికి కదలి వెళ్ళే సంప్రదాయం మహారాష్ట్రుల వల్లనే ఇతరత్రా వ్యాపించినదనడం సత్యం. పండరి భజనలు ఈ తెగకు చెందినవే.

తిరుమలకు ఈనాడు భారతదేశంలోని అన్ని ప్రాంతాలవారు రావడం విశేషం. 'కలౌ వేంకటనాయకః' అనడాన్ని నమ్మడం ఒక కారణమైతే శ్రీనివాసుని మహిమలవ్యాప్తి మరొక కారణం. వీటితో పాటు తిరుమల తిరుపతి దేవస్థానం బహుముఖ ఆధ్యాత్మిక కార్యక్రమాలు భిన్న ప్రాంతాలలో జరగడం కూడా చెప్పుకోదగింది. ఈ నేపథ్యంలోనే విదేశాలలో కూడా శ్రీనివాస ఆలయాలు వెలిశాయి. ఏతత్కారణంగా హిందువులే కాక ఇతర మతస్థులు కూడా డిక్లరేషన్ ఇచ్చి తిరుమల ఆలయదర్శనం చేసుకోవడం పరిపాటి అయ్యింది.

స్వామి సేవలు మహమ్మదీయులు కూడా భాగం పంచుకోవడం విశేషం. ఇందుకు బీబీనాంచియార్ కథ దోహదం చేసినదనడం వాస్తవం. పైగా ఎదుటివారి మతాన్ని అవమానించకుండా ఆదరణతో చూడటమన్న భావన దీనికి ప్రధానకారణమని చెప్పవచ్చు.

**తిరుమలకు మార్గాలు:**

తిరుమలకు పూర్వకాలంలో నాలుగు మార్గాలుండేవి. ఇవన్నీ ఒకప్పుడు నడకమార్గాలే లేదా చిరువాహనాలలో పయనిస్తూ చేరుకునే మార్గాలు. తలకోన, సిద్ధేశ్వర క్షేత్రం నుంచి అడవిలో తిరుమలకు దాదాపు 25 మైళ్ళు మార్గం ఒకటి. కడపజిల్లా నుంచి వచ్చేవారికి బాలపల్లి మామండూరు నుంచి

కనుమమార్గం. ఈ సోపాన మార్గం ఇంకా కొంతవరకు అలాగే ఉంది. దారిలో ఒకటి రెండు మండపాలు కూడా కనిపిస్తాయి. గోగర్భండామ్ ప్రక్కన ఉన్న ఈతకాయల మంటపం వాటిలో ఒకటి. మూడవదారి తిరుపతి నుంచి అలిపిరి మీదుగా చేరుకునే దారి. నాల్గవది చంద్రగిరి శ్రీవారి మెట్టుమీదుగా తిరుమల చేరుకునే దారి. బహుశః విజయనగర చక్రవర్తులు ఈ మార్గం మీదుగానే తిరుమల చేరుకునే వారేమో. తిరుమలలో నైవేద్యగంట విన్న తర్వాతనే చంద్రగిరిలోని పాలకులు భుజించేవారని ప్రతీతి.

పై మార్గాలేకాక కపిలతీర్థం, అక్కారంపల్లి, మంగళం, చెన్నాయిగుంట, కరకంబాడి మీదుగా శ్రీకాళహస్తికి ఒక మార్గం ఉండేది. శ్రీకాళహస్తి నుంచి తొండమనాడు, గుడిమల్లం, నీలిసానిపేట, గాజులమండ్యం, కల్లూరు, అత్తూరు, పుత్తూరుల మీదుగా నారాయణవరం, నాగలాపురం వరకు ఒకదారి ఉండేది. అలాగే తిరుపతి, తిరుచానూరు, అప్పలయ్యగుంట, తిరుమణ్యం మీదగా పుత్తూరుకు పోయే మార్గం. మెకంజీ ఖైఫీయతులలో తిరుమలకు ఇంకా అనేక దారులు చెప్పబడ్డాయి. మచ్చుకు ఉత్తరం నుంచి మామండూరు, శెట్టిగుంట మార్గాలు, దక్షిణం వైపు నుంచి తిరుపతి, కపిలతీర్థం, పేరూరు, శ్రీవారి మెట్టు మార్గాలు! తూర్పునుంచి కరకంబాడి, కాళహస్తి మార్గాలు, పశ్చిమం నుంచి నాగపట్లకనుమ మార్గాలున్నాయి. ఇవేగాక కపిలతీర్థం ఆలయ ప్రాంగణం నుండి తిరుమల చేరుకోడానికి ఒక రహస్య సొరంగమార్గం ఉందని ఐతిహ్యం. తొండమాన్ చక్రవర్తి ఆ మార్గంగుండా వెళ్ళిస్వామిని సేవించేవాడట.

ఈనాడు తిరుపతి చేరుకోవడానికి నడకమార్గాలేగాక రోడ్డు మార్గాలు, రైలుమార్గాలు, విమానమార్గాలు ఎన్నో ఉన్నాయి. కానీ తిరుమలకు మాత్రం నడక మార్గం రెండు (అలిపిరి–తిరుమల, శ్రీవారిమెట్టు–తిరుమల), అలాగే రోడ్డు మార్గాలు రెండు (పోవడానికి, రావడానికి) ఉన్నాయి. ఒకప్పుడు రైలు మార్గం వేయడానికి ప్రయత్నం చేసినా ఆధ్యాత్మిక దృష్టితో వ్యతిరేకత కారణంగా ఆదిలోనే హంసపాదు అయ్యింది. అలాగే తిరుమల చేరుకోవడానికి ప్రముఖుల



కోసం హెలీపాడ్ నిర్మాణం కూడా తీవ్రమైన ప్రతిఘటన రావడంతో అది కూడా నిలిచిపోయింది. ఈనాడు తిరుపతి నుండి దేశంలో విభిన్న ప్రాంతాలకు వెళ్ళడానికి సుమారు రైళ్ళవసతి ఉంది. అలాగే రేణిగుంటకూడా పలుప్రాంతాలకు వెళ్ళడానికి మార్గాలున్నాయి. ఇవేగాక రేణిగుంట విమానాశ్రయం నుండి ప్రస్తుతం హైదరాబాదు, ఢిల్లీ. వెళ్ళడానికి తగిన సౌకర్యాలున్నాయి. ఇవేగాక పాతకాలంలో ఢిల్లీమార్గం, బండ్లమార్గం ఉంటే ఆ తర్వాతి కాలంలో మోటారు సైకిళ్ళు, చిన్నకార్లు తితిదే బస్సులు ప్రస్తుతం ఆర్.టి.సి (రాష్ట్రరోడ్డు రవాణా సంస్థ) బస్సులు, ప్రైవేట్ టాక్సీలు మరికొన్ని ప్రయాణ సాధనాలున్నాయి.

**వేంకటాచల యాత్రాయాం**
**పాదమేకం మునీశ్వరాః**
**బ్రహ్మహత్యాది పాపఘ్నం**
**సంసారార్ణవ తారకమ్**

## తమిళుల తిరుమల యాత్రావిధానం:

తిరుమలకు విచ్చేసే తమిళుల యాత్రా విధానం అనేక రకాలు. సేలం, కొయంబత్తూర్ మొదలైన దూరప్రాంతాలనుండి కూడా కేవలం రెండు మూడు జతల బట్టలతో పసుపురంగు వస్త్రధారణతో కనీసము పాదరక్షలు కూడా లేకుండా గుంపులు గుంపులుగా పయనిస్తూ రహదారుల మార్గమధ్యంలో మజిలీలు చేస్తూ తిరుమల చేరేవారు ఒక వర్గం వారు.

తమిళులు పెరటాసి మాసంలో స్వామిని దర్శించటానికి ఇష్టపడతారు. మరి ఆ నెలలో శనివారం ముఖ్యంగా భావిస్తారు. కొండకు వచ్చినా, రాకపోయినా పెరటాసి శనివారాలలో తలస్నానం చేయడం, తిరునామం ధరించడం, పిండిదీపం వెలిగించడం, ఒక్కపొద్దు ఉండటం తమిళుల ఆచారం. ఈనెలలో తమిళుల మొగాలలో త్రిపుండ్రాలే కనిపిస్తాయి.

నాలాయిరం అనే ద్రావిడ వేదంలో ఆళ్వారుల పాశురాలలో శ్రవణ నక్షత్రం చెప్పబడింది. స్వామి తిరునక్షత్రం శ్రవణం. కృత్తికనాడు సుబ్రహ్మణ్యస్వామిని

తమిళులు సేవించినట్లే శ్రవణ నక్షత్రం రోజు తిరుమలేశుని సేవిస్తారు. ఈ నాలాయిరంలో 'ద్వాదశి' తిథి చెప్పబడింది కనుక తమిళులు ద్వాదశినాడు స్వామిని దర్శించడానికి ఇష్టపడతారు. అంతేగాక తమిళంలో 'శని నీరాడు' అనే ఆన ఉంది. శనివారం తలస్నానం చేయాలి అని అర్థం. మరికొందరు శునైనీరాడు జలపాతస్నానమంటారు.

కన్నడ హరిదాసులలో ప్రసన్న వెంకట దాసులు స్వామిని 'ద్రావిడవీర' అని సంబోధించారు. బహుశః ఆ దాసులు తిరుమలను సందర్శించిన వేళ వారికి తమిళులే ఎక్కువ కనబడడం కారణం కావచ్చు, లేదా ఎక్కడ చూచినా శ్రీవైష్ణవులు కనబడడం, నాలాయిరం అధ్యయనం, తమిళవైష్ణవ పదజాలశ్రవణం కారణాలు కావచ్చు.

తమిళుల స్వామిభక్తి మరొకరూపంలో కూడా ఉంది. తమ యింట పూజగదిలో తిరుమల యాత్రార్థము ఒక హుండీలాంటి చెంబు పెట్టి పసుపు బట్ట చుట్టి అప్పుడప్పుడు డబ్బులు వేయడం. అలాగే బాధలు కలిగిన వేళ ఇష్టులైనవారు రోగగ్రస్తులైన వేళ స్వామిని "వచ్చి సేవించుకుంటామని" ముడుపులు కట్టడం ఒక విధానం. ఇవేగాక తిరుమలకు విచ్చేసే వేళ తిరుమలకు వెళ్ళలేనివారు ధనకనకాదులను హుండీలో వేయవలసిందిగా కోరితే సమ్మతించి భద్రంగా తీసుకువచ్చి అర్పించే ఆచారం ఉంది. దారి వెంబడి తాము భక్తులమని చాటి చెప్పడానికే 'ఏళుమలైయానే తిరువేంగడవా' అని 'గోవిందా గోవిందా' అని గుంపుగా స్మరించడం ఒక విధానంగా కనిపిస్తుంది.

శ్రీవైష్ణవులలో వడగలై, తెంగలై సంప్రదాయాలున్నాయి. తెంగలై సంప్రదాయానికి భగవద్రామానుజులు వడగలై సంప్రదాయానికి వేదాంతదేశికులు మార్గచోదకులుగా వైష్ణవులు భావిస్తారు. రామానుజులవారు ఆదిశేష అవతారమూర్తి కనుక, తిరుమల శేషపర్వతము కనుక ఈ కొండపై నెలకొన్న స్వామికి రామానుజులవారు బహుముఖంగా కైంకర్యాలు చేయడంవల్ల తెంగలైవారు తిరుమలకు విచ్చేయడం సహజమైంది. తెంగలైవారికి ద్రావిడ



వేదమైన నాలాయిరం పరమ ప్రామాణికం. వడగలైవారికి సంస్కృత శాస్త్ర వర్ణిత నిర్దిష్ట వైష్ణవ సంప్రదాయాలు పరమ ప్రీతికరాలు. అయినా నాలాయిరాన్ని ఆళ్వారులను అభిమానించడం విశేషం. ఈ కారణంవల్లనే తిరుపతిలోను, తిరుమలలోను వడగలై, తెంగలై మతాలు ఏర్పడ్డాయి. ఆచారవంతులైన, కైంకర్యసేవా నిరతులైన శ్రీవైష్ణవులు తిరుమల యాత్రను నిర్దిష్ట ఉత్సవాలలో పాల్గొనడానికి వీలుగా సంకల్పించుకుంటారు.

ఆచారనిష్ఠులు తిరుమలలో జరిగే 'శాత్తుమురై'లో పెదజీయర్, చినజీయర్, ఏకాంగి వైష్ణవులలో స్వామిని సేవించడానికి ఉత్సాహం చూపుతారు. అలాగే కొండ మీద జరిగే అధ్యయన ఉత్సవాలలో ప్రధాన భూమిక వహిస్తారు. అంతేగాక ఆళ్వారులకు సంబంధించిన ఆచార్య పురుషులకు సంబంధించిన పర్వాలలో మాత్రమే భాగం పంచుకోవడం విశేషం. కనుకనే భగవద్రామానుజుల అవతారోత్సవాల సందర్భాలలోను, తిరుమలలో ఉద్యానవనం నిర్మించిన అనంతాళ్వాన్ తోటలో జరిగే ఉత్సవాలలో వీరి స్థానం ఇప్పటికీ పదిలం. ఇదేగాక ఉత్సవవరులు తిరువీధులలో ఊరిగే వేళ గుడిలోపలికి వెళ్ళి స్వామిని సేవించటానికి ఆచారవంతులైనవారు ససేమీరా ఒప్పుకోరు. స్వామి చిత్కళలన్నీ ఉత్సవమూర్తిలు సంక్రమితమవుతుందని వారి అభిప్రాయం లౌకికంగా ఆలోచిస్తే ఆరోజులలో ఆలయ పూజారుల సంఖ్య తక్కువ కావడంవల్ల గుడిలోపల, గుడిబయట కైంకర్యనిర్వహణ తలకు మించిన భారం కావడం కూడా కారణం కావచ్చు.

నిష్ఠాపరులైన శ్రీవైష్ణవులు బ్రహ్మోత్సవాలలో ప్రత్యేకించి గరుడోత్సవం రోజు విశేష సంఖ్యలో మలయప్పవరుల ముందు గోష్ఠి జరుపుతారు. అలాగే మరీ ఆచారవంతులైనవారు గుడిలోపలికి పోవడానికి కూడా ఇష్టపడరు. దిగుడు బావి లేదా చేదుడుబావి లేనిచోట ఉండటానికి కూడా ఇష్టపడరు. మరి తిరుచానూరులోని అలర్‌మేల్‌మంగై తాయారును దర్శించి ఆ తర్వాత తిరుమలకు వెళ్ళి సంప్రదాయబద్ధంగా వరాహస్వామిని దర్శించి, సేవించి తిరుమలేశునిపట్ల తమ భక్తిప్రపత్తులను ప్రకటించుకుంటారు.

తిరుమలలో స్మార్తసంప్రదాయాలకు తగినట్లుగా కంచిమఠం, పుష్పగిరి మఠంలాంటివి ఉన్నాయి. అలాగే ద్వైతసంప్రదాయులకు ఉత్తరాది. ఉడుపి, రాఘవేంద్ర,వ్యాసరాయమఠాదులున్నాయి. ఆచారనిష్ఠులు ఆ మఠాలలోనే వసతి, భోజనాదులు ఇష్టపడతారు. నేటి హోటలు విధానాలు నచ్చనివారుకూడా మఠాదులనే ఆశ్రయిస్తారు. మరికొందరు తి.తి.దే వసతిగృహాదులలో ఉంటూ భోజనాదులకు మాత్రం మఠాలకు వెళుతుంటారు. ఇవన్నీ ఐచ్ఛికాలు.

**కన్నడిగుల తిరుమలయాత్రా విధానం:**

ప్రాచీనకాలంలో కన్నడిగులు తమ తమ ఊర్లనుండి గుంపుగా నడుచుకుంటూ తిరుమలకు వేంచేసేవారు. కానీ తమిళుల్లాగా కన్నడిగులు సుదూరప్రాంతాల నుండి ప్రస్తుతం నడిచి రావడం లేదు. అరుదుగా పల్లెటూరివారు గుంపుగా తరలి వెనక వస్తూంటే ఒక వ్యక్తి ముందు నిలబడి జేగంటవాయిస్తూ పొదుగాటి వాద్యాన్ని అప్పుడప్పుడు మోగిస్తూ తిరుమలయాత్ర చేయడం లేకపోలేదు. ఈ విధానంలో ఎన్నో ప్రయోజనాలున్నాయి. ఒకటి అరణ్య ప్రాంతంలో దుష్టజంతువులు తమపై దాడిచేయకుండా జాగ్రత్తపడటం. రెండవది మజిలీ మజిలీగా సాగే యాత్రలో కొందరు మధ్య ఆగిపోయినా గంటల రవళిబట్టి మరొక గుంపులు చేరి రక్షణపొందడం.

కన్నడ హరిదాసులు తిరుమల యాత్రాక్రమాన్ని తమ దేవర నామగళులో సువిస్తారంగా వర్ణించారు. విజయదాసులు అనే వ్యక్తి సల్లలితమనదల్లి యాత్రమడె (కలవరం లేని మనస్సుతో యాత్రలు చేయండి) అని ప్రబోధించారు. పురందరదాసులు 'దాసరకూడె గోవింద అల్లి దారినడెవుదె చంద' (దాసులతో కూడా కలిసి ఉండి దాసులు నడిచేమార్గంలోనే ముందుకు తరలండని) క్రమశిక్షణా పద్ధతిని సూచించాడు. వ్యాసవిఠలదాసులు 'కాశి కర్ణాటకద దేశదేశద జనరు శ్రీశఉత్సవకే జనరు విదగిదరుగా' అని తిరుమలకు విచ్చేసే విభిన్న ప్రాంతీయులను ఉట్టంకించారు.

హరిదాస సాహిత్యాన్ని బట్టి కన్నడిగులకు వారోత్సవాలలో గురువారం పూలంగిసేవ అలాగే శుక్రవారం పునుగు కాపుసేవ సంవత్సరోత్సవాలలో



గరుడసేవ రథోత్సవసేవ, రథసప్తమీ ఉత్సవం మొదలైనవి చాలా ఇష్టమైనట్లు స్పష్టమవుతుంది. కన్నడిగులు తిరుపతి యాత్రను గిరియాత్రగానే భావించారు. ఇందుకు నిదర్శనంగా కన్నడహరిదాసులలో ఒకరయిన విజయదాసులవారు ఒక మనోహరాత్మకమయిన వర్ణన చేశారు.

స్వామి క్షీరసాగరమథనం చేసేవేళ మందర పర్వతాన్ని మోశాడు. అమృతమథనసమయంలో "హాలాహలవిషం ధాటికి దేవదానవులు నలువైపుల పరిగిడుతుంటే మహావిష్ణువు ఆదేశించగా పరమశివుడు ఆ విషాన్ని మింగగా. ఆ హాలాహలవిషాగ్ని దాహకత్వాన్ని నిర్మూలనం చేశాడు. శ్రీకృష్ణావతారంలో గోవర్ధనగిరిని చిటికెన వేలుతో ఎత్తి గో, గోపాలకులను కాపాడినాడు. శ్రీరామవతారంలో లంకలో రావణునితోడి సమరకాలంలో లక్ష్మణుడు మూర్ఛపోతే సంజీవని పర్వతం తెచ్చిన హనుమంతుని కరుణతో చూచాడు" అని.

విజయదాసులవారి భక్తినిష్ఠ అపారం, అగాధం. అందుకే 'ఈ గిరియ యాత్రియ మాడిద జనరిగె నాగశయన విజయవిఠల వెంకట పులివా' అన్నారు. తిరుమలగిరియాత్ర చేసే జనులను ఆదిశేషశయనంపై పడుకొన్న విష్ణువతార అర్చామూర్తి అయిన వేంకటేశ్వరుడు తప్పక అనుగ్రహిస్తాడని భరోసా ఇచ్చారు.

కన్నడిగులకు 'శ్రావణమాసం' ముఖ్యం. కారణం స్వామిది శ్రవణ నక్షత్రం కావడమే. శ్రావణ శనివారాలలో స్వామిని ఇంట భక్తి శ్రద్ధాదులతో సేవిస్తారు. ఇంట్లో ఎవరికయినా ఏ ఆపదలు వచ్చినా స్వామిని ప్రార్థించి 'ముడుపులు' కడతారు. తరువాత తిరుమలకు విచ్చేసి తమ కృతజ్ఞతలను అనేకరూపాలలో ప్రకటిస్తారు.

కొందరు 'నోటి తాళాలతో' సేవిస్తారు. ఈ సంప్రదాయాన్ని ఉగ్రశ్రీనివాసవిఠలరాయ దాసులవారు "జాగుమాడదె బాయి బీగవకైకొండు (ఏ మాత్రమూ ఆలస్యం చేయకుండా నోటి తాళాలు వేసుకొని) తిరుమలకు వస్తారని వర్ణించారు. తిరుమలకు వచ్చినవేళ దర్శనా త్పూర్వదినం 'క్షేత్ర

ఉపవాసం' పవిత్రంగా చేస్తారు. అంతేకాదు సాళ్వనరసింహరాయల ఆదేశంతో ముళబాగలు మఠాధీశులు శ్రీపాదరాయలవారి ఆజ్ఞానుసారం తిరుమలకు విచ్చేసి 'పన్నెండు సంవత్సరాలు' శ్రీవారికి కైంకర్యాలు చేసిన వ్యాసరాయలవారి ఆహ్నికమండపాన్ని దర్శించడానికి కుతూహలం కనబరుస్తారు. అంతేగాక సంపంగి ప్రాకార ప్రదక్షిణంలో వ్యాసరాయలవారు ఆసీనులై తపస్సు చేసిన చోటని చెప్పబడే ప్రదేశాన్ని భక్తిశ్రద్ధలతో దర్శిస్తారు. గురువారం పూలంగి సేవ, విమానంలో విమాన వేంకటేశ్వర పునఃప్రతిష్ఠ వ్యాసరాయలవారే చేబట్టారని కన్నడిగులు భావిస్తారు.

హరిదాసులలో ఒకరయిన విజయదాసులవారు తిరుమల శ్రీవారి గర్భగుడి చుట్టు ఐదు సారులు ప్రదక్షిణ చేసే సంప్రదాయాన్ని తన కీర్తనలో 'ఐదుసారె ప్రదక్షిణె వందిసి తిరుగిదరె' అని వర్ణించి ఈ సంప్రదాయం పాటించేవారికి స్వామి కోరిన పదవులు అనుగ్రహిస్తాడని విశదం చేశారు.

ఆళ్వారులలాగే కన్నడహరిదాసులు కూడా స్వామిని కీర్తించారు. 'దేవరందరె తిరుపతి–తిమ్మప్ప' "దేవుడంటే తిరుమల అప్పడే" అని వారి నిర్ణయం. 'సంకట బందాగె వెంకటరమణ' అనడంవారి సంప్రదాయం, కన్నడహరిదాసులలో పురందరదాసు స్వామిపై వందలాది 'దేవరనామగళు' పాడినవారు. తాళ్లపాక అన్నమాచార్యులను దర్శించగా అన్నమయ, సంతోషించి దాసులవారిని విఠలావతారునిగా పొగడినారట.

కీర్తనలు పాడుకొంటూ, కోలాటమాడుతూ, భక్తిశ్రద్ధలతో ప్రతి మెట్టుకు కుంకుమ పెడుతూ తిరుమల చేరుకోవడం కన్నడిగులకు ఒక సంప్రదాయం దీనినే మెట్లోత్సవం అంటారు. ఈ ఉత్సవాలను తి.తి.దే దాససాహిత్య ప్రాజెక్టు సమర్థవంతంగా చేస్తున్నది.

**ఆంధ్రుల తిరుమల యాత్రావిధానం:**

తిరుమల ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాంతం కావడం తెలుగువారు శ్రీనివాసుని తమ ఇంటి వేల్పుగా భావించడంవల్ల తెలుగువారికి 'తిరుమల యాత్ర' తమ



జీవితంలో ఒక భాగమయింది. కన్నడిగుల లాగే తెలుగువారికి శ్రావణ శనివారాలు ముఖ్యం. ఆపదల వేళ స్వామికి మొక్కుకోవడం, ముడుపులు కట్టడం, ప్రార్థనలు పూర్తిచేయడం తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలు. అన్నమాచార్యుల సంకీర్తనలలో తిరుపతి తిరుమల యాత్రావిధానం స్పష్టంగా ఉంది.

**నానదిక్కుల నరులెల్లా**
**వానల లోననె వత్తురు గదిలి**
**సతులు సుతులు బరిసరులు బంధువులు**
**హితులు గొలువగ నిందఱును**
**శతసహస్ర తోడనె వత్తురు గదలి**
**ముడుపులు జాళెలు మొగిదల మూటలు**
**కడలేని ధనము గంతలును**
**కడు మంచి మణులు కరులు దుర్గములు**
**వడిగొని చెలఁగుచు వత్తురు గదలి**
**మగుటవర్ధనులు మండలేశ్వరులు**
**జగదేకపతులు జతురులును**
**తగు వేంకటపతి దర్శింపఁగ బహు**
**వగల సంపదల వత్తురు గదలి**

తిరుమలకు ఆంధ్రులేకాదు ఇతర ప్రాంతాలవారు రావడాన్ని స్వామి కృపాకటాక్షాలకు పాత్రులు కావడాన్ని.

"నానా భూముల వారు నమ్మి శ్రీవేంకటపతి గానవచ్చి యేటనేట ఘనులయ్యేరు"అన్నాడు. కాని స్థానికులు మాత్రం 'మాయలఁబొందేరు' అని తన అభిప్రాయాన్ని భంగ్యంతరంగా చెప్పాడు

విజయ నగరపాలకుల కాలంలో తిరుమల యాత్రావిధానం చిన్నన్న 'అన్నమాచార్య చరిత్ర' వల్ల సుస్పష్టమవుతోంది. పాల్కురికి సోమన శ్రీశైల యాత్రావిధానం వర్ణించినట్లే చిన్నన్న ద్విపదలో వర్ణించాడు.

**నలుదెసల్ పరికించి నానావిధముల**
**విలసిల్లు శ్రీరాము వెల్లువల్ వోలె**
**దండెలు శ్రుతిగూడి తాళసంగతుల**
**దండి మద్దెలలు చిత్తరముగా ముట్ట**
**నానంద బాష్పము లదరనాగతుల**
**నానంద నందను నంకించి పాడి**
**తన్మయులగుచుఁజిత్రపు నాట్యగతుల**
**జిన్మయు నందునే చిక్కి చొక్కుచును**

**సనకాదులను పేర జనుదెంచువారి**
**ననుపదంబునిది మహర్లోకమనుచు**
**గోవింద గోవింద గోవింద యనుచు**
**నా వరుసనె నరహరి హరీ యనుచు**
**తిరుమలప్పను నాడు జీరకమున్న**
**వరములప్పని మ్రొక్కి వర్ణించువారి**
**నెఱులందు రంగు వన్నెలు పిసాళించు**
**నాఱపైన నిడుద మయూర కంఠములు**
**నటియించు కృష్ణాజనపుఁగిరీటములు**
**బటువైన బేగడె పాఱుటాకులును**
**పీలికుచ్చుల నెక్కు పెట్టిన దిండ్లు**
**ఫాలరేఖల నిండు పట్టె నామములు**
**ఘనమైన శంఖచక్రముల ముద్రికలు**
**పనువడ దేవర బోనముల్ పూని**
**కోనేటి రాయఁడె కొండలవాఁడె**
**కానిక రూకల కణజాల వాఁడె**
**వరముల రాయఁడెవాఁడె తిమ్మప్ప**

అంటూ కదిలేవారట



తరిగొప్పుల మల్లన్న చంద్రభాను చరిత్రలో తిరుమల యాత్రావిశేషా లెన్నో ఉన్నాయి. విజయలోలుడు చాలకాలం తరువాత కలుసుకొన్న చంద్రభానునితో తాను దర్శించిన ప్రదేశాలను చెబుతూ తిరుమల విశేషాలను వర్ణించాడు.

**అనశన వ్రతముచే సతుల కార్శ్యంబున**
**గనపట్టువోరి బీగములవారు**
**మ్రొక్కు దీర్చుటకునై మూఁక మూఁగలుగూడి**
**యేతెంచు తలమోపుటిండ్లవారు**
**బ్రాణముల్ పిడికిటఁబట్టుక యిట్టట్టు**
**దెమలని శిరసు కోడెములవారు**
**దైహికాయాసంబు దలఁపక దొర్లుచు**
**నడతెంచు పొరలు దండమువారు**

**నామటామట మ్రొక్కువారడుగు నడుగు**
**దండములవారు మిగుల సందడి యొనర్చి**
**నడరి పన్నగ సార్వభౌమాచలేంద్రుఁ**
**గొలువ కోటానుకోట్లు పెన్గూట మమర**

మరొక్క విశేషాన్ని చెప్పినవాడు అన్నమయ్య

**మారు చేతు లీయవద్దు మారుగాళ్ళీయవద్దు**
**బీరాన గుండెలు గోసి పెట్టవద్దు**
**గోరపడి చిచ్చులోన గుండాలు చొరవద్దు**
**ఊరక మీవారమని వున్నచాలు**
**సిడిదల లియ్యవద్దు జీవాలఁజంపవద్దు**
**బడిబడి పగ్గాలఁబారవద్దు**
**సిడి మీఁద బిత్తరపుచిమ్ములు చిమ్మగవద్దు**
**కడనుండి దారిఁగన్న చాలు.**

అనడం అన్నమయ్య హితోక్తి భంగ్యంతరంగా వీర శైవాచారాలు వద్దని చెప్పక చెప్పడం.

**గోవింద నామస్మరణం :**

సాధారణంగా ఏ ఆలయ సందర్శనంలోనూ భక్తులు మూకుమ్మడిగా ఏక నామోచ్చారణ చేయరు. కాని తిరుపతి తిరుమల యాత్రలో మాత్రం 'గోవిందా! గోవిందా' అనడం మనం వింటున్నదే. దీనికి ప్రధానంగా రెండు కారణాలు కనిపిస్తాయి.

మొదటిది భగవద్రామానుజులవారు తిరుపతిలోని గోవిందరాజస్వామిని తిరుమల శ్రీనివాసునితో అభేదంగా భావించడం. తిరుమలలో లాగే గోవిందరాజులవారికి అన్ని కైంకర్యాలు జరగాలని కట్టడి చేయడం.

రెండవది శ్రీకృష్ణావతారానంతరం మహా విష్ణువు తిరుమలలో అర్చావతారమూర్తిగా నిలబడడం. అతడే వెంకటనారసింహుడు. ఆ స్వామి వెంకటరాముడు. ఆ దేవుడే వేంకటకృష్ణుడు. శ్రీకృష్ణుడు గోవర్ధనగిరిని ఎత్తి కొండక్రింద గోవులకు గోపాలురకు ఆశ్రయం కల్పించాడు. భక్తులు తామెక్కుతున్నది కొండ కనుక గోవిందుని స్మరిస్తారు. గోవుమీద గొడ్డలి వేటు పడకుండా పుట్టలోని స్వామి అడ్డుకోవడం కూడా ఇందుకు కారణం కావచ్చు.

'తిరుమలై ఒళుగు' అనే గ్రంథంలో "ఘుష్యతే సంఘశః ఉచ్చైః గోవిందేతి పునః పునః" అని భక్తులు గుంపులు గుంపులుగా గోవిందా గోవిందా అంటూ ఘోషిస్తుంటారని విశదం చేయబడింది. బహుశః ఈ నేపథ్యంలోనే అన్నమయ్య.

**'కొలిచితే రక్షించే గోవిందుఁడితఁడు**
**యిలకు లక్ష్మికి మగఁడీ గోవిందుఁడితఁడు'**

అని కృష్ణావతార సన్నివేశాలను వర్ణించి

**పొంది శ్రీవేంకటాద్రిపై పొసఁగఁదిరుపతిలో**
**అందమై పవ్వళించిన ఆ గోవిందుఁడితఁడు**

అన్నాడు. ఆలాగే 'గోవిందాది నామోచ్చారణ కొల్లగ దొరికెను మనకెపుడు' అని నోరార పలకవలసిన అవసరాన్ని చెప్పక చెప్పాడు.



కన్నడంలో 'ఉరగాద్రివాసవితల దాసులవారు' కూడ భక్తులు గోవింద నామస్మరణతో కొండ ఎక్కడాన్ని

**"గోవింద సచ్చిదానంద ముకుందనెందు**
**చ్చరిప భకుతరిగె శరణు"**

గోవింద, సచ్చిదానంద, ముకుంద అని ఉచ్చరిస్తూ కదిలే భక్తులకు శరణు శరణు అన్నాడు. ఆలాగే ప్రాకారం చుడుతూ పొరలు దండాలు పెట్టేవారిని "మత్తె ఉరుళుతలీ" మరల పొరలువారు అని తాను దర్శించిన దృశ్యాన్ని వర్ణించాడు.

అన్నమయ్య కాలంనాడు తిరుమలకు విచ్చేసి భక్తాదుల వర్తనను

**పెట్టనది నుదుటను పెరుమాళ్ల లాంఛనము**
**దట్టమై భుజములందు దైవశిఖామణి ముద్ర**
**నెట్టన నాలుకమీఁద నీలవర్ణునామమిదె**

**తనువుపై ఁదులసి పద్మాక్షమాలికలు**
**దినము గడుపు నించేది హరిప్రసాదనము**

స్వామి ప్రసాదం మాత్రం తిని తిరుమలలో గడిపేవారని ఈ వర్ణనవల్ల తెలుస్తున్నది. అన్నవిక్రయ, మహాపాపం, ప్రత్యేకించి తీర్థక్షేత్రాదులలో అందుకే తి.తి.దే. 'నిత్యాన్నదానం' ప్రోత్సహిస్తున్నది. ఈ ప్రాజెక్టుకు లక్షలాది రూపాయలు విరాళాలుగా వస్తున్నాయి.

**ఔత్తరాహుల తిరుమల యాత్రాక్రమం:**

తిరుమలకు విచ్చేసేవారిని పరస్థలులు, దేశాంతరులనడం పరిపాటి, పరస్థలులు అంటే పరస్థలం వాసంగా కలవారు. వీరినే వాడుకలో 'పరషలు' అంటారు. అన్నమయ్య సంకీర్తనలలో పలుచోట్ల 'పరష' శబ్దముంది. ఆంధ్ర ప్రాంతంలోని వారు కానివారు దేశాంతరులు. అన్నమయ్య

'అగణితంబైన దేశాంతరుల మతంబులను' ప్రస్తావించివున్నాడు.

**సంజీవని పరషల కొదవగను**

**పాదలి పురుషలెల్లా పొదిగి సేవించేరు**

**తిరుమై కోనేటి చెంతఁదీర్థఫలములనెల్ల**

**పరుషల కొసగీని పరమాత్ముడు**

అని అంటే పురందరదాసులవారు కూడా

**"అల్లల్లి పరిషెయ గుంపు**

**మత్తల్లి తోపిన తంపు"** అన్నారు.

ఔత్తరాహులు (గుజరాతీయులు, రాజస్థానీయులు) ఒక గురువు ముందుకు నడుస్తుంటే అతని వెంబడి భజనలు చేస్తూ కదలుతారు. వారికిష్టమయిన నామోచ్చారణ 'గిరిధర గోపాలా'.

ఔత్తరాహులకు వల్లభాచార్యులంటే గౌరవం. వల్లభాచార్యుల వారు తెలుగువారని ప్రసిద్ధి. ఉత్తర భారతదేశంలో భక్తిమతాన్ని ప్రచారం చేసిన ఘనుడు ఆతడు వరాహస్వామి ఆలయంలో ఒక స్తంభం దగ్గర కూర్చొని తపం చేసేవారట. అందువల్ల ఔత్తరాహులు వరాహస్వామిని దర్శించి వల్లభరాయస్తంభాన్ని సేవించి ఆపై తిరుమలేశుని సేవకు తరలివెళతారు ఆలాగే నేపాల్ ప్రాంతంవారు రావడం అనాదిగా ఉంది.

అన్నమయ్య శ్రీనివాసుని సేవిస్తూ రాధామాధవ కీర్తనలు. జగన్నాథస్తుతులు విరివిగా చేసి వైష్ణవభక్తులను ఏకం చేశాడు.

**శ్రీవారిమెట్టు మార్గం:**

ఏ ఆలయంలోనూ ప్రధానమూర్తిని 'శ్రీవారు' అని వ్యవహరించరు. ఒక్క తిరుమలలోనే శ్రీవారు, శ్రీవారి బ్రహ్మోత్సవాలు, శ్రీవారి మెట్టు అని వ్యవహరిస్తారు. ప్రత్యేకించి వైష్ణవులు 'శ్రీనివాసప్పెరుమాళ్' అనడం ఈ పదాల వ్యాప్తికి కారణం కావచ్చు.



తిరుమల గిరులలో ఒకటి 'శ్రీపర్వతం' 'శ్రీశేషశైల గరుడాచల వేంకటాద్రి నారాయణాద్రి వృషభాద్రి వృషాద్రిముఖ్యాం' అని సుప్రభాతంలోని శ్లోకం. వాటిలో మొదటిది శ్రీపర్వతం. శ్రీపర్వతమార్గమే శ్రీవారి మెట్టు.

తిరుమల చేరుకోవడానికి ప్రాచీన మార్గాలలో ప్రసిద్ధం శ్రీవారిమెట్టుమార్గం. శ్రీనివాసమంగాపురంలోని స్వామిని సేవించి ఆపై శ్రీవారి మెట్టుచేరుకొని సోపానమార్గంలో తిరుమల చేరుకోవడం నాటికీ నేటికీ ఉంది. ప్రస్తుతం తిరుమల తిరుపతి దేవస్థానంవారు ఆ దారిగుండా నడిచే వారికి అనేక సౌకర్యాలు కల్పించారు. 'మెట్టు' అంటే పడికట్టు. ఇది కూడా 'అలిపిరి' లాంటిదే.

చంద్రగిరిని ప్రధానస్థావరంగా ఏర్పాటు చేసుకొన్న విజయనగరరాజులు ఈ మార్గంగుండా తిరుమల వెళ్ళేవారట. ఈ ప్రదేశంనుండి అవ్వాచారికోన దాక ఒక మార్గముండేదని రాతిస్తంభాలను ఈ మార్గం ద్వారా తిరుమలకు తరలించేవారని అంటారు. దీనికే ఏనుగుల దారి అని కూడా పేరు. ఈ దారిలో నైష్ఠికులయిన శ్రీవైష్ణవుల స్నానపానాదులకు తగిన నడచాలి కూడా ఉంది. ఇక్కడి ఆంజనేయస్వామి దర్శనీయుడు.

స్వామి పద్మావతిని వివాహమాడాక పసుపు బట్టలతో కొండఎక్కరాదని అగస్త్యులవారంటే ఆరునెలల కాలం శ్రీనివాసమంగాపురంలో ఉండేవారని ప్రతీతి. ఈ ఆలయాన్ని తాళ్లపాక వంశస్థులు పునరుద్ధరించారు. ఈ క్షేత్రం దగ్గరే 'కళ్యాణి' నది ఉంది.

**అలనాటి తిరుమలవాస నియమాలు:**

తిరుమలేశుడు మహావిష్ణువు అర్చావతారం వల్ల శ్రీవైష్ణవులకు 'తిరుమల' పరమపవిత్ర మయింది. ఆ పవిత్రతను కాపాడడానికోసం, శ్రీవైష్ణవులు తిరుమలకు వేంచేసే వారనడంలో సందేహంలేదు. అయితే వారు తిరుపతి నుండి ఏమార్గంలో ఎలా చేరేవారో దారిలో ఏయే పౌరాణిక ప్రసిద్ధిగల స్థలాలు దర్శించారో స్పష్టంగా చెప్పలేం.

పురాణాల ప్రకారమే అయితే శుకాదిమునులు, భృగ్వాది తపోధనులు, ప్రహ్లాదాది పుణ్యాత్ములు, అంబరీషాది రాజులు తిరుమల పర్వతరాజాన్ని

మహావిష్ణువు మూర్త్యంతరంగా భావించి పాదాలతో కొండపై నడవడానికి భయపడి దూరాన వసించేవారట. కొండలనుండి ప్రవహించే నదులలో స్నాన తర్పణాదులు ఆచరిస్తూ నారాయణ సాక్షాత్కారం కోసం తపిస్తూ తపస్సు చేసేవారని స్పష్టమవుతుంది.

తిరుమల అరణ్య ప్రాంతం, శిలామయం కావడంవల్ల దివ్యనగర విస్తారానికి అనువుకాని కారణంవల్ల పూర్వకాలంలో చెండివాళన్-ద్రుమకుతారుడు దేవాలయానికి పడమటి వైపున ఒక వీధి నిర్మించి అక్కడ కైంకర్యపరులు మాత్రం నిత్యనివాసం చేసేలాగున ఏర్పాట్లు చేశాడని ఐతిహ్యం. కాలక్రమేణ తిరుమలలో ఉత్సవాలు జరపడానికోసం స్వామి పుష్కరిణికి తూర్పుతీరంలో దక్షిణోత్తరంగా ఒక క్రోసు నిడివిగల ఒక శ్రీవీధి నిర్మితమయింది. కొందరు కైంకర్యపరులు మాత్రం నిత్యవాసం చేసేవారు.

తిరుమలలో నిత్యనివాసం చేసేవారికి కూడా ఎన్నో కఠిన నియమాలుండేవి. తిరుమల అప్రాకృతం కనుక అక్కడి కందమూల ఫలాదుల్ని స్వేచ్ఛగా భుజింపరాదని కట్టడి. ఆలాగే కందమూలాలను భోజ్య పదార్థాలను హవిస్సును ముందుగ విష్ణుమూర్తికి నివేదన చేసిన తరువాత ఆ ప్రసాదంతోనే జీవించాలని నియమం. ఇండ్లలో పాకం చేయరాదని దేవాలయంలోనే పాకం చేయించి స్వామికి నివేదించి ఆ ప్రసాదాన్ని గృహదేవతలకు నివేదించి ఆయా కాలాలకు తగిన హవ్యకవ్యాలతో దేవతార్చన, పితృదేవతారాధన చేయాలని సూచన. దేవాలయ ఆచారాలకు విరుద్ధములయిన కూరలు, పండ్లు, గడ్డలు తినరాదని నిషేధం. అంతేగాక తిరుమలపై వసించేవారు సంతానప్రాప్తి కలిగే సమయంలో మృత్యువు సంభవిస్తుందని తెలిసినవేళలో, హఠాత్పరిణామాలలో అడివారానికి ఆ శరీరం చేర్చి దహన సంస్కారం చేయాలని ఒక సౌలభ్యం. మరి తిరుమలలోని మృగాలు, పక్షులు భగవత్స్వరూపాలు కావడం వల్ల తామసగుణావిష్టులైన మనుష్యులు హింసింపరాదని, ఉత్సవకాలంలో దివ్యబలి యోగ్యమయిన శ్రీనగర వీధులలో పాదరక్షలు తొడుగుకొనరాదని, వాహనాలు అధిష్ఠింపరాదని పలువేరు ఆంక్షలు. యవనులు, పతితులు, పాపులు



అప్రాకృతమయిన అరణ్యావృతమయిన కొండనెక్కరాదని వామనపురాణం విశదీకరించినది. చివరకు పరమశివునికి కూడా 'అడివారం'లో ఒక యోజన దూర ప్రదేశంలో ఆగ్నేయమూలంలో స్థలం కేటాయింపబడ్డది. కైంకర్యపరులకు మాత్రం పుష్కరిణి చుట్టుపక్కల ఒక యోజన పరిమిత ప్రదేశం కేటాయింపబడింది. ఇన్ని నియమములుండడం వల్ల ప్రాచీనకాలంలో తిరుమలకు చేరుకొనేవారు తక్కువ కావడం వింతేమికాదు.

కాని తిరుమలలో స్వామికి తోయకైంకర్యం నిమిత్తం వచ్చినవారు తిరుమలనంబి. రామానుజుల మేనమామ. ఆలాగే ఉద్యానవన నిర్మాణానికి సిద్ధమై వచ్చినవారు అనంతాళ్వాన్ ఆ తరువాత భగవద్రామానుజులు. తదనంతరం తిరువరంగ ప్పెరుమాళ్ అరైయర్, వేదాంత దేశికులు మణవాళ మహామునులు.

తిరువరంగ ప్పెరుమాళ్ కాంచీపురం మార్గంగా బయలుదేరి దేవరాజప్పెరుమాళ్‌ను నుతించి తిరుమల అడివారంచేరి, గోవిందరాజస్వామిని సేవించి, అలిపిరి దగ్గరలోని కొండ అడుగుభాగంలోని దివ్య చించా వృక్ష సమీపంలో విజయం చేసివున్న పరాంకుశ పరకాలుర చరణాలకు సాగిలిమొక్కి శైలమధిరోహించి దారిలో నరసింహస్వామికి ప్రణమిల్లి తిరుమల చేరుకొన్నారని 'తిరుమల సమయాచారములు' లోని గ్రంథాంశాలు స్పష్టం చేస్తున్నాయి.

భగవద్రామానుజులవారు మూడుమార్లు తిరుమలకు విజయం చేసినట్లు ఐతిహ్యం. తిరుమలేశునికి, గోవిందరాజ స్వామికి అభేదం పాటించి తిరుమలలోలాగే తిరుపతిలో అధ్యయనోత్సవాలు జరిగేలాగున, ఆలాగే తిరుమలలో ఆళ్వారుల సన్నిధులు లేనందున తిరుపతిలో ఆళ్వారుల మూర్తులను ప్రతిష్ఠ సేయడం లాంటివి చేశారు. తిరుచానూరులోనే గాక తిరుమలలో బ్రహ్మోత్సవాలు జరిగే లాగున మాడవీధుల విస్తరణ, సేవాపరులకు సౌకర్యముల కల్పన లాంటివి చేశారు. చాల కాలము దాకా తిరుమలకు వెళ్ళలేదు కూడా రోజూ గోవిందరాజస్వామి ఆలయ ప్రాంగణం నుండి అలిపిరి చేరి తిరుమలనంబికడ శ్రీమద్రామాయణ రహస్యాలు వినేవారట. తిరుమల పవిత్ర

సాలగ్రామం కావడం వల్ల పాదాలతో తొక్కరాదని మోకాళ్లతో కొండెక్కేవారని ప్రతీతి. స్థూలంగా ఆనాడు తిరుపతి–తిరుమల నడకల దారిలో అలిపిరి–తింత్రిణీవృక్షం–త్రోవలో నారసింహ ఆలయం ప్రసిద్ధి వహించినట్లు చెప్పవచ్చు.

**తిరుమల కొండకున్న ప్రాధాన్యం:**

ఆలయాలు కొన్ని నదీతీరాల్లో, మరికొన్ని అరణ్యాలలో, ఇంకాకొన్ని పర్వతాలలో, గుహలలో కూడా ఉన్నాయి. శ్రీవేంకటేశ్వరుని ఆలయం మాత్రం పర్వతారణ్యప్రాంతంలో కావడం విశేషం. స్వామి కారణంగా పర్వతం, నది అన్నీ పవిత్రమైనాయి. స్వామి శివునితో, అనంతోహం మహాదేవా స్థాస్యామి గిరి రూపధృత్ మహాదేవా! అనంతుడనయిన నేను గిరిరూపం పర్వతాన్ని ఘనంగా కీర్తించారు.

చేరి మొక్కుడీ అంబరచుంబి శైలాన్ని (నెఙ్జు వణంగుమినో శేణుయర్ వేంగడమ్) వేంకటగిరి శిఖరమెక్కి నిలిచిన భగవంతుని శ్రీచరణం ఆశ్రయించి ఎపుడూ ఉజ్జీవింపుదు (వేంగడమదైంద మాల పాదమే యదైందు నాళుమ్ ఉయ్మన్) అని నుతించారు.

అన్నమాచార్యులవారు కూడా పురాణోక్త అంశాలను, ఆళ్వారుల అనుభూతులను జతచేసి ఎన్నో పర్వతస్తుతి కీర్తనలు పాడారు. వాటిలో 'అదివో అల్లదివో హరివాసము' బాగా ప్రసిద్ధి పొందిన కీర్తన. రెండవది

**"కట్టెదుర వైకుంఠము కాణాచయిన కొండ**
**తెట్టలాయ మహిమలే తిరుమల కొండ"**

అన్నమయ్య కాలం నాటి తిరుమల ప్రకృతి రమణీయం. యాత్రికులకు ఏలాంటి శ్రమ కలుగజేయని వాతావరణం కలదేమో. అందుకే

**"తోరణములే త్రోవెల్లా**
**మూరట బారలుముంచిన లతల**
**వింజామరలును విసనకఱ్ఱలును**
**గొంజెగొడుగువే కొండెల్లా"** అన్నారు.



కూటువ నెమళ్ళు, కోవిల గుంపులు, పక్షిజాతుల దర్శనానుభవాలు, కోరిన పండ్లు కురిసేటి తరువులు ఆనాటి యాత్రికులకు అలవోకగా అందుబాటులో ఉండేవేమో. అలాగే 'కూరిమి మటములు గోపురంబులు" విశ్రాంత ప్రదేశాలని కూడా వర్ణించాడు.

తిరుమలను ఏడుకొండల సమాహారంగా ప్రస్తుతం చెప్పుకొంటున్నాం. కాని కృతయుగంలో వృషభద్రిగా, త్రేతాయుగంలో అంజనాచలంగా, ద్వాపరంలో శేషాచలంగా ఈ కొండ పిలువబడేదని అంటారు. మరో కథనంప్రకారం కృత యుగంలో అంజనాచలం, త్రేతాయుగంలో వేంకటాచలమని వ్యవహారం–అందువల్లనే అన్నమయ్య

"అదె చూడు తిరువెంకటాద్రి నాలుగుయుగములందు వెలుగొంది ప్రభ మీఱగను" అని వర్ణించి ఈ కొండ విస్తీర్ణతను కూడా విశదీకరించాడు.

నేడు పఠింపబడే సుప్రభాతంలో, శ్రీనివాస గద్యలో మాత్రమే ఏడుకొండల ప్రస్తావన ఉన్నాయి. శ్రీపర్వతం, శేషశైలం, గరుడాచలం, వేంకటాద్రి, నారాయణాద్రి, వృషభాద్రి, వృషాద్రి. ఇవి ఏడుకొండలు, ఇవేగాక పురాణాలలో మరికొన్ని చింతామణి, జ్ఞానాద్రి, తీర్థాద్రి, పుష్కరాద్రి, కనకాద్రి, సింహాచలం, అంజనాద్రి, వరాహాద్రి, నీలాద్రి, శ్రీనివాసగిరి ఆనందాద్రి, సుమేరు శిఖరం లాంటివి చెప్పబడ్డాయి. కన్నడ హరిదాసులు ఈ పేర్లతో బాటు సుగంధపర్వతవాస, సప్తగిరియవాస, కుండలగిరియవాస అన్నారు.

జలప్రళయాలు వస్తే జనులు భయంతో ఎత్తయిన ప్రదేశానికి వెళ్ళడం సహజం. సంసార జలధిలో మునిగినవారికి ఆటుపోటుల అలలకు డీలాపడేవారికి రండి రండి అని ఎత్తయిన ప్రదేశంలోని స్వామి ఆహ్వానించేలాగున తిరుమలమీద స్వామి ఉన్నాడట. ఏది ఏమయినా తమిళులు 'తిరువేంగడముడైయాన్' అని వ్యవహరించడం గుర్తించదగ్గ అంశం. ఈ కొండకు వరాహస్వామి కారణంగా వరాహ క్షేత్రమని పేరు. అయినా క్రమంగా 'వెంకటాద్రి' స్థిరపడిపోయింది.

కొన్ని ఆలయాలలో గోపురదర్శనం ప్రధానం. తిరుపతి తిరుమలలో 'గిరిశిఖరదర్శనం' ప్రధానం. కన్నడ వాగ్గేయకారుడయిన విజయదాసులవారు

గిరిశిఖర దర్శనం గురించి "గిరియశిఖరవకండె", "గిరియశిఖరవనోడి" అని రెండు సుదీర్ఘకీర్తనలు పాడారు. అలసి సొలసి ఆరాటంతో తిరుపతి చేరుకోగానే కళ్ళకు కనబడే కొండను కొండశిఖరాన్ని చూచి తలవంచి చేతులు జోడించి మరల సాష్టాంగ నమస్కారం చేసి పరమ భక్తితో పరిపరివిధాల కొనియాడుతూ ఆ అనుభవాన్ని పునరావృతం చేసుకొంటూ కదలడాన్ని రమ్యంగా వర్ణించారు. భక్తి సాధన లేనివారికి పర్వత దర్శన భాగ్యం అబ్బదు అన్నారు. తిరుమలలో ఒక కాలు పెడితే చాలు ఆవ్యక్తి కులకోటి ఉద్ధరింపబడుతుందన్నారు. ఉరగాద్రి విఠల దాసుల వారయితే పుణ్యపాకం ఉంటేగాని గిరిదర్శనం లభించదని అన్నారు.

వేదాంతదేశికులవారు తమ దయాశతకంలో

**"ప్రపద్యే తం గిరిం ప్రాయః**
**శ్రీనివాసానుకంపయా**
**ఇక్షుసారస్రవంత్యవ**
**యన్మూర్త్యా శర్కరాయితమ్"** అని కీర్తించారు. శ్రీనివాసుని కరుణారస ప్రవాహమే చెరకురసంగా ప్రవహించి ఘనీభవించి చక్కెరఖండంగా తిరువేంకటాచల పర్వతంగా రూపపరివర్తనం చెందిందని భావం.

పరమశివుడే సనకాదులతో అనంత జన్మ సంస్కార సాధనం లేక ఈ వేంకటాచల దర్శన భాగ్యము దక్కదని బోధించాడట. ఈ పౌరాణికాంశాన్ని విజయదాసులవారు

**'అనంత జనుమకె సాధనకూడాదల్లదే**
**ఈనగ దారిగూ దరుశన వాగదు'**

గిరదర్శనం, గిరి ప్రదక్షిణం శైవంలో కూడా పుణ్యఫలాలుగా చెప్పబడ్డాయి.

**తిరుపతి తిరుమల యాత్రలో మజిలీలు:**

**ఆళ్వార్ తీర్థం:**

తిరుపతి తిరుమలకు విచ్చేసే వారి సంఖ్య క్రమంగా పెరుగుతుండడం అందరికి తెలిసిన అంశమే. ప్రాచీన కాలంలో తిరుపతి తిరుమలకు వచ్చేవారికి స్నానపానాదులకు అవకాశమిచ్చిన ప్రాంతాలెన్నో, సుమారు 30 సంవత్సరాల కిందట తిరుపతి చుట్టూ చెరువులే కనిపించేవి.



తిరుపతి జ్యోతిటాకీసు ముందు చాకలివారు బట్టలుతుకుతున్న గుంట 'బ్రహ్మగుండం'. దాని పక్కన మంచి నీళ్లగుంట అనబడే కోనేరు 'నరసింహతీర్థం'. ఈ తీర్థాలకు తూర్పున తారు రొడ్డుకు ఆనుకొని మరొక చెరువు. అదే రామచంద్రగుంట. ప్రస్తుతం 'రామచంద్ర పుష్కరిణి'.

తిరుపతి–రేణిగుంట మార్గంలో పారువేటమండపం దగ్గర నీటి సౌకర్యం కోసం ఒక చిన్నగుంట ఉండేది. తిరుచానూరుకు పశ్చిమంగా సువర్ణముఖి తీరంలో పొన్న కాలువ. తిరుపతి గోవింద రాజస్వామి ఆలయ ప్రాంతంలో ఎగజిమ్మే బుగ్గ ఉండేది. అలాగే 'పాతకోనేరు' గోవిందరాజస్వామి ఆలయానికి చేరువలో నుండేది. అలిపిరి మార్గంలో 'సింగరాయ గుంట'. కోర్టు దగ్గర మరోచెరువు ఉండేది. ఇవన్నీ యాత్రికులకు జలసౌకర్యాన్ని కలిగించే స్థావరాలు. ఇవేగాక తాతాయగుంట, మల్లయ్యగుంటలు, తాళ్లపాక చెరువులు ప్రస్తుతం మార్కెట్టు, తుడా ఆవరణలో ఉండేవి. ఇన్ని ఉన్నా సహజసిద్ధమయిన జలపాత ప్రదేశాన్ని తైర్థికులు కోరుకోవడం విశేషం. ఇదే 'ఆళ్వార్‌తీర్థం'.

తిరుమలను వైష్ణవక్షేత్రంగా చెప్పుకొన్నా తిరుపతి తిరుమల పరిసరాలలో ఈశ్వరాలయాలు, శక్త్యాలయాలు తమ ఉనికిని నిలుపుకొంటున్నాయి. వాటిలో 'కపిలేశ్వరస్వామి ఆలయం' కపిలతీర్థం చాలా ముఖ్యమయినవి. తిరుమల కొండనుండి జాలువారే జలపాతం చేరువ 'కపిలేశ్వర సన్నిధి' ఉండడం విశేషం. అయితే అనేక కారణాలవల్ల ప్రస్తుతం 'ఆళ్వార్ తీర్థంగా' ప్రసిద్ధి పడసింది.

ఆళ్వార్ తీర్థ పరిసరాలలో 'నమ్మాళ్వార్' గుడి ఉంది. ఆళ్వారులలో నమ్మాళ్వారుది పేచీలేని పెద్దపీట. తిరుపతిలో ప్రత్యేకంగా నమ్మాళ్వార్ సన్నిధి ఉండడం విశేషం. ఆళ్వార్ తీర్థ సమీపంలో నమ్మాళ్వార్ గుడి గోడ మీద ఒక తమిళశాసనం

"దివ్యజ్ఞానం పొందిన ఒక ముని ఇక్కడ నివసిస్తున్నాడు. దయాళువై ఆతడు మానవులకు బ్రహ్మవిద్యోపదేశం చేస్తున్నాడు" అని ఉంది.

కాలక్రమంలో శైవాధిక్యం పెరగడంతో కపిలతీర్థం నామం ప్రచారం కావడంతో కలవరపడి అనేక ఉప పత్తులతో ఈ జలపాతం 'ఆళ్వార్ తీర్థం' అని ప్రచారం చేయడానికి వైష్ణవాచార్యులు, భక్తులు ప్రయత్నించారనడం వాస్తవం. 'తిరుమల సమయాచారములు' అనే పుస్తకంలో ఈ అంశాలెన్నో ప్రస్తావితం.

శ్రీగోవింద రాజస్వామివారి ఉత్సవకాలంలో అవబృథం జరగడానికి కార్తిక మాసంలో వనభోజనోత్సవం, తీర్థాభిగమనోత్సవం కొండాడడానికి మేఘమాసంలో పూర్ణిమనాడు స్వర్ణముఖిలో తాము త్రవ్వించిన తిరుపూఅల్ శైత్యోపచారం ఉత్సవం జరిపించడానికి కట్టడి చేశారు.

ఉత్సవ విగ్రహంగా ఉన్న ఆళ్వారులను తీర్థతీరంలో మూలవిగ్రహంతో విజయం చేయించి 'ఆళ్వార్ తీర్థ'మనే నామధేయం స్థిరపడేలా చేసారు. అంతేగాక శైవజనాన్ని శిక్షించి తరిమి వేసి నాలుగు దిక్కులలో చక్రశిలలను నాటించి కపిలేశ్వర సన్నిధిలో కూడా చక్రశిల నాటారని 'తిరుమల సమయాచారములు' స్పష్టం చేస్తున్నాయి.

అచ్యుత దేవరాయలు కపిలతీర్థం దగ్గర కూడా పట్టాభిషేకమహోత్సవం చేసుకొన్నడట. పెదతిరుమలాచార్యులు ఈ తీర్థంలో చక్రశిలాస్థాపనకు కృషిచేశారని శాసనాలు చెబుతున్నాయి. ఇప్పటికి నాలుగువైపుల సుదర్శన చక్రశిలా ఫలకాలుండడం గుర్తించవచ్చు.

కపిలతీర్థానికే చక్రతీర్థమని పేరు ఉంది. చక్రుడు అనే పేరు గల ఇంద్రుడు గౌతముడు లేని వేళ ఆశ్రమానికి వచ్చి కల్లబొల్లిమాటలు చెప్పి అహల్యతో కాపురం చేయగా గౌతముడు శపించాడు. శాపగ్రస్తుడైన ఇంద్రుడు చక్రనామకుడు స్నానం చేసి శాపంపోగొట్టుకోవడం వల్ల ఈ తీర్థానికి 'చక్ర తీర్థమ'నే పేరు వచ్చింది. కపిలతీర్థంలో చక్రత్తాళ్వార్ గుడి కూడా ఉండటం విశేషం.

కపిల తీర్థంలోని కోనేటికి పడమరవైపు కొండలో గుహ ఉంది. సంధ్యావందన మండపం నుండి గుహ వరకు మెట్లున్నాయి. ఆ గుహలో నరసింహస్వామి విగ్రహం కూడా ఉంది. యాత్రికులు విగ్రహందాకా వెళ్ళవచ్చు.



ఆపై కటిక చీకటి ఈ గుహ ద్వారం గుండానే తొండమాన్ చక్రవర్తి, యోగులు తిరుమల స్వామి గర్భగుడిదాకా వెళ్ళి సేవించేవారని ప్రతీతి.

ఏది ఏమైనా శైవులు, వైష్ణవులు అనే భేదం లేక జలపాతరూపంలో పారే కపిలతీర్థంలో–ఆళ్వార్ తీర్థంలో స్నానం చేయడం పరిపాటి. ఈ ప్రాంతంలోని కపిలేశ్వరాలయం గుహాలయంగా విఖ్యాతం. ఈ కపిలతీర్థం పైననే మరిఐదు పుణ్యతీర్థాలు ఉన్నాయని పురాణాలు ఘోషిస్తున్నాయి. ఈ పర్వత శ్రేణుల్లోనే మాలాడగుండ జలపాతాలున్నాయి. పాతకాలంలో తలనీలాలు ఇక్కడే సమర్పించేవారట. కొండకు చెక్కబడిన వేంకటేశ్వరస్వామిని దర్శించుకొనే వారట. ఆనాటి దళితులు అలిపిరి దాకా వెళ్ళి కొండకు మొక్కి వెనుదిరిగి వచ్చే వారని పెద్దలు చెబుతుంటారు.

**అలిపిరి:**

కొండ దిగువభాగాన్ని తమిళులు 'అడివారం' అని అంటారు. శిష్టులైనవారు 'అడిపడి' (మొదటిమెట్టు) అని వ్యవహరిస్తారు. కానీ ఈనాడు 'అలిపిరి' అన్న శబ్దానికే వ్యాప్తి ఉంది. ఈ శబ్దానికి సంబంధించి రెండు కథనాలున్నాయి. ఒకటి ఆదిశేష అంశతో కూడిన ఒక పెద్ద చింతచెట్టు ఉండటం. వైష్ణవంలో చింతచెట్టుకు ప్రాధాన్యమెక్కువ. నమ్మాళ్వార్ చింతచెట్టు తొర్రలోనే చాలాకాలం ఉండి దర్శనభాగ్యం కల్గించేవారట. అడివారంలో పులి (చింత చెట్టు) ఉండటం వల్ల అడిపులిగా స్థిరపడి వ్యవహారంలో అలిపిరిగా మారిందంటారు. ఇదేకాక హైదరాలి దండెత్తి వచ్చినపుడు కొండ మీది దేవుడెవడని అడిగినప్పుడు హిందూమంత్రి వరాహం అని చెప్పినప్పుడు ఆ వరాహ శబ్దార్థం 'సువరే' అని తెలియగానే హైదరాలి గుర్రం పై దౌడుతీస్తూ పారిపోగానే అక్కడివారు ఆలీపారె అన్నారట. ఆలీ పారిపోయాడని అర్థం. 'ఆలీపారె' అనేదే వాడుకలో 'అలిపిరి' అయ్యిందని కొందరు చమత్కరిస్తూ ఉంటారు.

**పాదాల మండపం:**

వాడుకలో దీనిని 'పడాలమంటపం' అని అంటుంటారు. ఈ మంటపంలో చాలామంది శ్రీవారిని సాగిలబడి మొక్కుతున్నట్లుగా శిల్పాలు చెక్కబడి ఉన్నాయి.

అవి తిరుమలకు రాలేని హరిజనులవి కావచ్చు. లేదా శరణాగతి చేసిన వైష్ణవులవి కావచ్చు. స్వామివారి పాదాలకిక్కడ ప్రాధాన్యం. పాదరక్షల కొక ప్రాధాన్యం.

శ్రావణ శనివారాలు ఉపవాసముండి భక్తులు పిండి తలిగలు వేస్తారు. ఆ పిండిమీద స్వామి ముద్ర వేస్తారు. ఈ ముద్ర ఒకే చోట కాదు. రెండుచోట్ల. తొండ మండలంలో ఉత్తరపు కొన, శ్రీకాళహస్తి అగ్రహార ప్రాంతంలో ఒక హరిజనుని ఇంట. అలాగే దక్షిణం కాంచీపురం ప్రాంతంలో ఒక హరిజనుని ఇంట. ఉత్తరంగా కుడిపాదం, దక్షిణంగా ఎడమపాదం ముద్రలు పడతాయి. ఆ పాదముద్రలను కొలతలు వేసి శ్రీవారికి చర్మంతో చెప్పులు కుడతారు. దానికి కుచ్చులా, కుళ్ళాయిలూ అన్నీ పెట్టి అందంగా తయారు చేస్తారు. కాళహస్తి నుంచి ఒకడు, కంచివైపు నుంచి ఒకడు కుడి, ఎడమ కాలి శ్రీవారి చెప్పులను నెత్తిన పెట్టుకొని ఊరురా భిక్షమెత్తుకుంటూ వచ్చి అలిపిరిలో పూజ చేసి ఆ పాద రక్షలను ఆ పూజామందిరంలో పెడతారు. ఒక్కొక్క చెప్పు ఒకరికి తెలియకుండా మరొకరు కుట్టినా కొలతలు తీసి ఒక్కడే కుట్టినట్లు సరిగ్గా జోడు సరిపోతాయి. అంటే నిజంగా స్వామి పాదాలు అక్కడ ముద్రలు వేశాయన్న మాట. ఇది సంవత్సరానికి ఒక పర్యాయం జరిగేది. ప్రస్తుతం ఈ సంప్రదాయం చాలావరకు మరుగుపడి పోయిందని చెప్పాలి. స్వామి ఆ చెప్పులతో కొండల్లో, కోనల్లో తిరగడం వల్ల అరిగిపోయేవట. కథ ఏదైనా చంద్రగిరి కాలిదారి వెంట, తిరుపతి కాలిదారి వెంట, తిరుమల పాపవినాశనం మార్గాలలో పాదముద్రలు కనిపిస్తాయి. తొండవాడ దగ్గర కూడా పాదముద్రలు ఉండటం గుర్తించవచ్చు. ఈ మండపం ఎదురుగా ఒకప్పుడు 'అలగరిసింగ్' అని ఆలయం ఉండేది. కానీ ప్రస్తుతం లక్ష్మీనారాయణస్వామి ఆలయం ఉంది.

**అలగిరి సింగడు:**

తమిళనాడులో 'అలిగర్ కోయిల్' అనే దివ్యదేశం ఉంది. అక్కడి స్వామి 'సుందరబాహు' నామాంకితుడు. అక్కడ నారసింహ ఆలయం కూడా ఉంది. ఈ దృష్టితో అడివారంలో నారసింహ ఆలయం వెలసి ఉండవచ్చు. కొండకు వెళ్ళేవారు అరణ్యమార్గంలో భయభీతులు కాకుండా ఉండడానికోసం మొదట నరసింహుని సేవించేవారని భావించడానికి వీలుంది. అంతేగాక అన్నమయ్య కూడా నారసింహభక్తుడు కావడం వల్ల ఈ నరసింగని సేవించి ఉండవచ్చు.



**తలయేరు గుండు:**

ఇది అచ్చమైన తెలుగు సమాసం. అన్నమాచార్య చరిత్రలో కూడా ఈ శబ్దజాలం ఉంది. తిరుమలకు వెళ్ళే నడకదారిలో పెద్దరాతిగుండు ఉంది. తిరుమలకు దిగే వాళ్ళు మోకాళ్ళనొప్పులు, తలనొప్పులు పోగొట్టుకోవడానికి, రాకుండా ఉండటానికి తమ మోకాళ్ళనూ, ఆ తలయేరు గుండుకు స్పర్శిస్తుంటారు. తద్వారా నొప్పులు రావనీ, తగ్గిపోతాయనీ ఒక నమ్మకం ఉంది. ఇలాగే కొన్ని ఆలయాలలో ఒంటి తలనొప్పులకు కూడా తల ఆనించడం ఒక సంప్రదాయంగా ఉంది. కొన్ని శిలలకున్న ప్రత్యేక అయస్కాంతశక్తి ఈ నమ్మకాలకు కారణం కావచ్చు.

**శ్రీపాదాలు:**

భగవద్రామానుజులు వారు తిరుపతికి విచ్చేసి మూడు రోజులు శుష్కోపవాసం చేసి ఆపైనే కొండ ఎక్కారని ప్రసిద్ధి. తిరుపతిలో ఒక సంవత్సరం కాలం పాటు రామానుజుల వారు గోవిందరాజుల సన్నిధినుండి కొండ అడివారము దాకా వెళ్ళేవారు. కొండమీద నున్న తిరుమల తోయ కైంకర్యం చేసే తిరుమల నంబి కొండదిగి తలయేరు గుండు దగ్గర రామాయణ రహస్యాలు బోధించేవారని ఐతిహ్యం. ఒకరోజు మధ్యాహ్నం కాగా పూజకు ఆలస్యమైందనీ తిరుమల నంబి బాధపడుతూ ఉంటే ఎదురుగా దివ్య కుసుమ మృగమద కర్పూర సుగంధ సమ్మిశ్రిత స్వామి పాదాలు ప్రత్యక్షమయ్యాయని శ్రీపాదాలకు అక్కడ ప్రతిష్ఠ కల్గిందని వేంకటాచల ఇతిహాసమాల విశదం చేస్తుంది. ఈ కారణం వల్లనే ఈ స్థానానికి పవిత్రత కలిగింది. అన్నమయ్య భక్తిశ్రద్ధలతో పాడిన

**"బ్రహ్మ కడిగిన పాదము**
**బ్రహ్మము దా నీ పాదము**

**పరమయోగులకుఁబరిపరి విధముల**
**పరమొసగెడి నీపాదము**
**తిరువేంకటగిరి తిరమని చూపిన**
**పరమపదము నీ పాదము"**

**కుమ్మరమండపం:**

ప్రస్తుతం ఈ మండపానికి సంబంధించిన చిత్తరువులు కనిపించవు. ఈ మండపం తొండమాన్ చక్రవర్తి కాలం నాటి భీమ అను పేరుగల కుమ్మరివాని కథను తెలియజేస్తుంది. స్వామి సేవకు వంటకుండలు చేసి అర్పించడం కుమ్మరి భీమ వంతు. కుండలు చేసి చివరకు చేతిలో మిగిలిన మట్టితో పువ్వులు చేసి రాతికున్న వేంకటేశ్వర మూర్తికి అర్పించేవాడట. తిరుమలలో తొండమాన్ చక్రవర్తి స్వర్ణపుష్పాలు సమర్పించినా అవి జారిపోయాయట. స్వామి ఆదేశించగా తొండమాన్ చక్రవర్తి కురువరతి నంబిని కలసికొని సంభావించి నాడట. చివరకు స్వామి అహంకృతిని తొలగించుకున్న రాజుకు, కుమ్మరికి సాయుజ్యం ప్రసాదించాడని వేంకటాచల మాహాత్మ్య కథలు చెబుతున్నాయి. అన్నమయ్య ఈ కథను చాలాచోట్ల ప్రస్తావించి ఉన్నాడు. మచ్చుకు.

**కురువనంబి తిరుమల కురువనంబి నీ**
**చరణములే కొలిచి బ్రతికే కిరీటము గల రాజు**

**కొండలలో నెలకొన్న కోనేటిరాయడు వాడు**
**కొండలంత వరములు గుప్పెడువాడు॥**
**కుమ్మరదాసుడైన కురువరతినంబి**
**ఇమ్మన్న వరములెల్ల నిచ్చినవాడు**
**దొమ్ములు సేసినయట్టి తొండమాంజక్కురవర్తి**
**రమ్మన్న చోటికి వచ్చి నమ్మినవాడు॥**

ఈ కుమ్మర మండపం తరువాత నిట్టనిలువునా ఎక్కడానికి కూడా శ్రమకరమైన పెద్ద ఎక్కుడు ఉన్నది. ఆపై మజిలీ గాలిగోపురం.



**గాలిగోపురం:**

ఈ పేరు రావడానికి రెండు కారణాలు పెద్దలు చెబుతారు. గోపురమన్నాక తప్పక ఆలయముండాలి. ఆలయమన్నాక విగ్రహముండాలి. కానీ ఇక్కడ ఆలయమూ లేదు. విగ్రహమూ లేదు. ఇది ఖాళీగోపురం కనుక వాడుకలో గాలిగోపురమైంది. ఈ గోపురం దగ్గర గాలి హోరున వీస్తుండడం ఒక కారణం కావచ్చును. ఒకప్పుడు ఈ గోపురాన్ని ఖాళీ గోపురమని, కొండమీది దైవం అమ్మవారనీ వాదించినవారు కూడా లేకపోలేదు. ఈ గోపురం మీదే వెంకటేశ్వరుని తిరునామం శంఖచక్రాలూ అమర్చబడి ఉన్నాయి. ఈ ప్రాంగణంలో ఒకటి రెండు చిన్న ఆలయాలు కూడా ఉన్నాయి. ఇక్కడ గోరక్షానాథుడనే సిద్ధుడు తపస్సు చేసినట్టు చెబుతారు. తాళ్ళపాక కవులు వేంకటేశ్వరున్ని వర్ణించేవేళ గోరక్కురే, గోరక్కురే అనికూడా సంబోధించారు. ఈ గుడుల సంరక్షణకోసం గాలిగోపురం ఆలయసంస్థ ఒకటి ఉన్నది.

కన్నడ హరిదాసులలో ఒకరయిన ఉరగాద్రివాసవిఠలదాసులు 'మెల్లమెల్లన భక్తరుల్లాసవనె తోర్వ చల్వ గాళిగోపుర ద్వారక్కె శరణు' అన్నారు.

**త్రోవలో నారసింహ ఆలయం:**

అలిపిరి దగ్గర నారసింహ ఆలయం ఉన్నట్టే దారిలో కూడా నారసింహ ఆలయం ఉన్నది. ఈ అటవీ సుందర, నరసింహస్వామిని 'తిరువరంగ ప్పెరుమాళ్ అరయర్' సేవించినట్టు 'తిరుమలై ఒళుగు' అనే గ్రంథం సాక్ష్యమిస్తూ ఉంది. అవ్వాచారికోన ప్రారంభంలో గరుడాద్రి మీద ఉన్న ఆలయమే లక్ష్మీ నృసింహాలయం. తిరుమలకు 'సింహాద్రి' అని కూడా ఒక పేరు ఉంది. హిరణ్య కశిపు వధ ఇక్కడే జరిగిందని ఐతిహ్యం. హిరణ్య కశిప సంహారానంతరం ఉగ్రనరసింహస్వామి అడవుల వెంబడి పోతూ లక్ష్మీదేవిని, ముక్కోటి దేవతలను గుర్తించలేదట. లక్ష్మీదేవి బాధపడుతుంటే త్రిమూర్తులు ఎలాగైనా నరసింహస్వామిని గరుడాద్రి దాటనీకుండా చేస్తామని మాటఇచ్చారట. చెంచులక్ష్మి రూపంలో లక్ష్మిరాగా ఉగ్రనరసింహస్వామి శాంతించినట్టు ఐతిహ్యం. సాళువ నరసింహరాయలు ఈ ఆలయాన్ని పునరుద్ధరించినట్లు చెబుతారు.

అలిపిరిలో బయలుదేరిన యాత్రికులకు మరికొంత రక్షగా నారసింహ స్వామి కరుణ అబ్బడానికి ఈ ఆలయస్థాపన జరిగి ఉండవచ్చు.

**అక్కగార్లు:**

నారసింహ ఆలయం దాటాక బస్సులు కూడా నడిచే మార్గంలో అక్కగార్ల గుడి ఉంది. ఒకప్పుడు అది పాత నడక దారిలో ఉండేదట. రోడ్డు వేసే వేళ రోడ్డు నిలబడలేదని, ప్రాణ నష్టం జరిగిందని అంటారు. ఆ తర్వాత అక్కగార్లను ఘాట్‌రోడ్డు పైకి తరలించారు. పాత నడక దారిలో పెద్ద శిలా ప్రతిమగా అక్కగార్లు ఉండేవారట. ఈ గుడికి తలుపులే లేవు. అక్కగార్లకు గ్రామదేవతా శక్తి ఉందని ఇప్పటికీ ప్రజలు నమ్ముతారు ఇక్కడే కొండల బండల సందుల నుండి చల్లటి నీటి తుంపరలు పడుతుంటాయి. ఈ జలాన్ని తీర్థంగా భక్తులు భావిస్తారు.

**అవ్వాచారికోన:**

తిరుమల నడక దారిలో మోకాళ్ళ పర్వతానికి ముందుండే లోయ అవ్వాచారికోన. 'అవ్వాచారి' అనే వైష్ణవ భక్తుని పేరు ఈ కోనకు వచ్చిందని ఐతిహ్యం. మరి కొందరు నారసింహ ఆలయ దర్శనానంతరం పెద్దలోయలో దిగి ఆవైపు చరియ ఎక్కడం అవసరం వల్ల అవ్వలి చరియ అని అన్నారు. ఇక్కడ నుండే చంద్రగిరి దృశ్యాలను చూచే సంప్రదాయం ఉంది. మరికొందరు పచ్చని చెట్లు పెద్దలోయ, సుందర దృశ్యాలు చూచి వహ్వా కోన అనడం వల్ల వ్యావహారికులు అవ్వాచారి కోన అయిందంటారు. అక్కడి నుండే చలికూడా మొదలు కావడం వల్ల అవ్వ చలికోన అని పేరు వచ్చిందంటారు.

**మోకాళ్ళముడుపు:**

మోకాళ్ళ ముడుపు తిరుమల నడకదారిలోనే చాలా ఎత్తైన మెట్లు గల కొండ ప్రాంతం. అవ్వాచారి నుండి ఆ మెట్లు ఎక్కడం కష్టంగా ఉండేది. ఏనుగులు మోకాళ్ళను ఆన్చి ఆ కొండలు ఎక్కేవని అంటారు. అంతేగాక ఎక్కేవేళ మోకాళ్ళు పట్టుకోవడం కారణం కావచ్చు. ఈ పర్వతభాగాన్ని ఉరగాద్రి విఠలదాసుల వారు తమ సంకీర్తనల్లో ఇలా కీర్తించారు.



**"తిరుతిరుగి తురువను కరువు అరసువంతె**
**తిరుదిరి మొనకాళ మురిగె శరణు"** అన్నారు.

ఆవు దూడ కోసం అలమటిస్తున్నట్లుగా ఈ దారిలో ఆగి ఆగి ఎక్కవలసి ఉంటుందని కవి భావం కావచ్చు. ఈ కొండమీద అన్నమయ్య చెప్పుకాళ్ళతో ఎక్కి అలసిపోయి వెదురు పొదకింద సొమ్మసిల్లి పడిపోయాడట. అప్పుడు అమ్మవారు అన్నమయ్యకు దర్శనమిచ్చి పాదరక్షలు తొడుగుకొని కొండ ఎక్కరాదని ప్రబోధించి ఆ తరువాత దివ్య ప్రసాదం తానే అన్నమయ్యకు తినిపించిందట. ఆ సందర్భంలోనే అన్నమయ్య వేంకటేశ్వర అనే మకుటంతో ఒక శృంగార శతకాన్ని చెప్పినట్లుగా అన్నమాచార్య చరిత్ర స్పష్టం చేస్తూఉంది. అమ్మవారు ''తిరుమలప్పని దేవదేవుని కొలువ అరుగు మటంచు'' ఆదేశించిందట. తొలి శృంగార శతకం ఇదే కావడం విశేషం. ఈ శతకంలోని పద్యాలు మనోహరత్మకాలు.

**అరసెలు నూనె బూరియలు నౌఁగులుఁజక్కెరమండెగల్ వడల్**
**బురుడలు పాలమండెఁగ లపూపము లయ్యలమేలు మంగ నీ**
**కరుదుగ విందువెట్టుఁబరమాన్నశతంబుల సూపకోట్లతో**
**నిరతవినిర్మలాన్నముల నేతులసోనల వేంకటేశ్వరా!**

**త్రోవ భాష్యకారులు:**

భాష్యకారులంటే భగవద్రామానుజులు అని రూఢి. రామానుజుల రచనలలో శ్రీభాష్యం విశిష్టమైనది. అంతేగాక ఆయన దక్షిణవైష్ణవానికి మూలపురుషుడు. శ్రీరంగం, కంచి, తిరుమల క్షేత్రాలలో పూజాదికాలను క్రమబద్ధం చేసిన పుణ్యమూర్తి. ఆ మూర్తి విగ్రహం గోవిందరాజస్వామివారి ఆలయంలో, తిరుమల మార్గ మధ్యంలో, శ్రీవారి ఆలయంలో కనిపిస్తాయి.

ఒకసారి రామానుజులవారు వేంకటాచల యాత్ర చేసినప్పుడు తిరుమలనంబి, అనంతాళ్వాన్‌లు స్వామి ప్రసాదమైన మామిడి పండ్లను చేతగొని ఎదురేగి రామానుజులకు సమర్పించారట. అప్పుడు రామానుజులవారు –

"ప్రాప్త మాత్రేణ భుంజీయాత్ ప్రసాదం పావనం హరేః!"- దొరికినదే తడవుగా పావనమైన హరి ప్రసాదం స్వీకరించాలని తెలియజేసి భుజించారట. ఆపై కింద పడిన పండ్ల టెంకలు క్రమంగా మొలకెత్తి ఫలవంతమయ్యాయట. ఆ మామిడి చెట్లున్న స్థలమందే తరువాతివారు ఒక గుడి కట్టించి భగవద్రామానుజులను అర్చామూర్తిగా ప్రతిష్ఠించినారట. ఈ భాష్య కారులనే అన్నమయ్య

**గతులన్ని ఖిలమైన కలియుగమందును**
**గతి యీతఁడే చూపె ఘనగురుదైవము**

**నియమవసు లీతఁడెకా నిలిపెఁబ్రపన్నులకు**
**దయతో మోక్షము చూపెఁదగ నీతఁడె**
**నయమై శ్రీవేంకటేశునగ మెక్కి వాకిటను**
**దయఁజూచీ మమ్ము నిట్టే తల్లిదండ్రి దైవము**

అని స్తుతించారు.

**ఏడవ మైలు దారిలోని ఆంజనేయస్వామి:**

ఈ విగ్రహం అర్వాచీనం. అయినా అందంగా యాత్రికులను ఆకర్షిస్తుంది. మోకాలు మెట్లు ఎక్కినవారికి విశ్రాంతిని ప్రసాదించే స్థలం. కాలిబాట, రోడ్డుబాట ఇంచుమించు సమానంగా ఇక్కడ కనిపించడం విశేషం. ఈ స్వామి దగ్గరే జింకల పార్కు ఉంది. ఇది కూడా ప్రాచీనం కాదు. దారిలో యాత్రికులకు కాసంత వినోదాన్ని కల్గించే ప్రాంతం.

కృష్ణ జింకలున్న చోటనే యాగాలు చేయాలని శాస్త్రం నిర్దేశిస్తుంది. అనేక కారణాల వల్ల కొండమీద జింకలు నశించాయి. ఈ ఉద్దేశ్యంతో ఈ పార్కును ఏర్పాటు చేశారు.

**సారెపెట్టెలు:**

బండలు పెట్టెలు లాగా కనబడటం ఒక విశేషం. అలమేలు మంగమ్మ ధన ధాన్య పట్టు చీనాంబరాలతో, పిండి వంటలతో సారెలను పెట్టెలోపల పెట్టి కొండెక్కి వచ్చిందట. వేంకటేశ్వరుడు ఏవేవి తెచ్చావని వాకబు చేయగా కరివేపాకు తేలేదని తెలిసింది. అలవేలుమంగమ్మ ఇప్పుడే తెస్తానని చెప్పి ఆంజనేయ స్వామిని కాపలపెట్టి కొండ దిగిందట. ఆ తర్వాత తిరుచానూరులో శిలైపోయిందని ఒక ఐతిహ్యం.



**తిరుమలలో ప్రాచీనుల యాత్రాక్రమవిధానం:**

ఈ అంశం అన్నమాచార్యచరిత్రలోను, పరమయోగివిలాసంలోనూ విశదంగా కనిపిస్తుంది. పరమయోగి విలాసంలో

"ఆదియావరణమున-వైకుంఠగోపురమునకుఁబ్రణమిల్లి గారుడ స్తంభంబు చక్కి వినతుడై-చెంతఁగ్రొవ్విరి సాలకేఁగి చంపకావరణంబు వలచుట్టి-స్వామి పుష్కరిణితోయంబులాని ఉత్తుంగభాగమున నా యహికులపతియవతార మగుచుఁదిరుగని చింతలం దెరలించు నీడదిరుగనిచింతకు మ్రొక్కి-రెండవ గోపురము దాటి లోని కమలమహానసాగార సేవించి- ఆనందనిలయమణి విమానమును సేవించి-మహామణిమంటము సేవించి-తురగ తార్క్ష్యాహి నాయకుల సేవించి-నిత్యుల సేవించి-లోని కరుదెంచి అలుమేలుమంగా మనోజు"ని దర్శించిన క్రమమును వర్ణించెను.

అతఁడే పిదప అన్నమాచార్య చరిత్ర ద్విపద యందు అన్నమాచార్యుడు స్వామి దర్శనమున కేఁగిన క్రమమును గూర్చి విపులీకరించుచు నిట్లు రచించాడు.

'కోనేరు గడతెంచి తీర్థవిభుని సేవించి-సోబనాలతోఁగనుపట్టు స్వామి పుష్కరిణి సోయగంబునకు విస్మయముఁజెంది-ఆదివరాహస్వామి నాదరంబునఁ గొనియాడి వల చుట్టుకొని వచ్చి-పెద్ద గోపురము సేవించి-నీడదిరుగనిచింత వర్తిల నమ్రుఁడగుచు-గరుడ గంభము పేర్మిగని సాగి మ్రొక్కి-చంపకపుఁ బ్రదక్షిణము చనుదెంచి-స్వామి పుష్కరిణి బూజించినడగోపురము సొత్తెంచి ప్రసాదము లమ్ముపట్టు లరసికమ్మని వాసనల కలరి-శ్రీనివాసుని నమస్కృతి చేసి దండ కానుపించిన భాష్యకారులఁబొగడి-శ్రీనరసింహుని సేవఁగావించి,

జనార్దను మన్నించి-అలమేలుమంగ కభివందనములు సలిపి-ఆనంద నిలయంబు గాంచి మరుగురుక కల్యాణమంటపమునకు కరములు మోగిచి-చెంగటి తేజి కెఱంగి-బంగారు గరుడని భజయించి-శేషునిఁగొలిచి-పరుసలు రాఁగా బండారమును దేరగొనుచు కాసుకానుక బెట్టి-----స్వామివారి దివ్యమంగళ విగ్రహంబును కన్నులారా 'సేవించి'-అన్నమయ్య చరితార్థుడయ్యెను.

**కళ్యాణకట్ట:**

తిరుమలను చేరుకొన్న యాత్రికులు మొదట వసతి సౌకర్యాలు చూసుకోవడం సహజం. ఈ వసతి సౌకర్యాలు అనేకరకాలు. ఉచిత వసతి, నిర్ణీత బాడుగ చెల్లించి లభ్యమయిన చోట్ల చేరడం లేదా మఠాదులలో సంపాదించడం వగైరాలు వసతికల్పన అయ్యాక మొక్కుబడి చెల్లించాలను కొనేవారు 'కళ్యాణకట్ట' వైపు నడవడం ప్రధానాంశం.

'కళ్యాణకట్ట' అనే సమాసం చిత్రమయింది. ఏ దేవాలయ పరిసరంలోనూ ఈ పేరు వ్యాప్తిలో లేదు. తమిళంలో ముడి సెలుత్తువదు అని, ముడి సమర్పణె అని కన్నడంలో వ్యవహారం. తెలుగువారు తలనీలాల సమర్పణ అని అంటారు. ఈ సమర్పణ జరిగే స్థలం కళ్యాణకట్ట. ఈ పేరు రావడానికి ప్రధానంగా రెండు కారణాలను చెబుతారు.

శ్రీనివాసమంగాపురం దగ్గర ప్రవహించేనది 'కల్యాణి'. ఆ 'కల్యాణి' తీరంలోనే మంగలికట్టలుండేవి. ఆ మార్గం గుండా వచ్చే భక్తులు 'తలనీలాలు' సమర్పించి కల్యాణిలో స్నానాదులు ముగించేవారు. జనం చేరితే గుంపుగా శ్రీవారి మెట్టుద్వారా వెళ్ళేవారు.

శ్రీవారి మెట్టు దారి వెయ్యేళ్ళనాటిది. ఇమ్మడి నరసింహరాయలు చంద్రగిరి కోటను నిర్మించేవేళ ఈదారి వాడుకలో ఉండేది. అపుడు ఈ దారికి 'శ్రీపతి మెట్టు! అని పేరు. ప్రస్తుతం ఈ దారి ద్వారా భక్తులు వెళుతున్నారు.

బౌద్ధంలో 'కల్యాణం' అన్నది సన్యాసస్థితిని తెలియజేస్తుంది. మానవునికి 'అహంకారత్యాగం' అవసరం. కేశాలు తల మీద మొలిచేవి. అందువల్ల మొలిచిన



'కేశాలు' తొలగించడం ప్రధానమయింది. అంతేగాక మంచి చెడ్డ అనే ఆలోచనలు తలలోనివి. వికృతంగా బయటపడేవి. నాచుమొక్కలు ఏరి పారేసినట్టుగా వాటిని తొలగించుకోవడం, నేపథ్యంలో ఈ 'తలనీలాలు' సమర్పణ వచ్చిందని పెద్దలంటారు. వీరభక్తిలో, తామసభక్తిలో తలను సమర్పించడం ఉంది. క్రమంగా తలస్థానంలో తలనీలాల సమర్పణ నిలిచిపోయింది. పూర్తిగా ముండనం చేసుకోవడమే సంప్రదాయం. తలనీలాల సమర్పణలో కత్తెరల ఛేదనం, మీసాలు మాత్రం ఉంచుకోవడం లాంటివి శాస్త్రసమ్మతంకావు. తిరుమల పుణ్యస్థలం కనుక తలనీలాల సమర్పణకు తిథివార నక్షత్ర మాస నియమాలు లేవు. ఆలాగే పగలు, మధ్యాహ్నం రాత్రి అనే సందర్భాలు లేవు. ప్రత్యేకించి తమ పిల్లలకు ఒక ఏడాది నడిచేలోగా తిరుమలలో తలనీలాలు సమర్పించడం కొందరిలో ఇప్పటికీ ఉంది.

**'తీర్థోపవాసః కర్తవ్యః శిరసో ముండనం తథా**
**శిరోగతాని పాపాని యాంతి ముండనతోయతః'** అని పద్మపురాణం చెబుతూంది.

**స్వామిపుష్కరిణి:**

తిరుమలలో 'సర్వతీర్థ ఫలసిద్ధిని' ప్రసాదించే పుష్కరిణి ఉంది. స్వామి అంటే కుమారస్వామి అని రూఢి. కుమారస్వామి ఈ తీర్థప్రదేశంలోనే తపస్సు చేశాడని ఐతిహ్యం. శంకణ మహారాజుకు స్వామి పుష్కరిణిలో ప్రత్యక్షం కావడం వల్ల ఈ పేరు వచ్చిందని ఒక కథనం.

కన్నడ హరిదాసులందరు ఈ 'పుష్కరిణిని' స్తుతించినవారే. ప్రసన్న వెంకటదాసులవారు 'స్వామిపుష్కర తీరనిలయనమో' అని సుతించారు. జగన్నాథ దాసులు 'తీర్థోత్తమత్వ సాపేక్షే' అని ప్రశంసించారు. వ్యాస విఠలదాసులు 'స్వామి పుష్కరిణి నివాసా నాదకామిత ప్రదనె లక్ష్మీశ' అని పొగిడారు. పురందరదాసులవారు 'నోడు నోడు వేంకటేశ' కీర్తనలో 'స్వామి పుష్కరిణియ తీరదల్లి వాస మాడిద స్వామి వాసమాడిద' అని నొక్కి చెప్పారు. హరపనహళ్లి భీమవ్వ అనే కవయిత్రి 'అప్పవెంకోబన నేత్రదలి' కీర్తనలో 'స్వామి పుష్కరిణియలి

స్నాన పానవమాడి నోడిదెను' అని కీర్తించింది. ఆలాగే 'స్వచ్ఛవాద స్వామి పుష్కరిణియ' అని స్వచ్ఛతను వినుతించింది.

అన్నమయ్య

**'సకల గంగాది తీర్థ స్నానఫలములివి**
**స్వామి పుష్కరిణి జలమె నాకు'** అన్నాడు.

కోనేటి పవిత్రతను, సోయగాన్ని అన్నమయ్య వర్ణించిన తీరు మనోహరాత్మకం.

**దేవునికి దేవికిని తెప్పల కోనేటమ్మ**
**వేవేల మొక్కులు లోకపావని నీ కమ్మా**
**ధర్మార్థ కామ మోక్షతతులు నీ సోబనాలు**
**అర్మిలి నాలుగు వేదాలదే నీ దరులు**
**నిర్మలపు నీ జలము నిండు సప్తసాగరాలు**
**కూర్మము నీ లోతు వో కోనేరమ్మా**
**తగిన గంగాది తీర్థములు నీ కడళ్ళు**
**జగతి దేవతలు నీ జల జంతువులు**
**గగనపుఁబుణ్యలోకాలు నీ దరి మేడలు**
**మొగ నీ చుట్టు మాకులు మునులో యమ్మా**
**వైకుంఠనగరము వాకిలే నీ యాకారము**
**చేకొను పుణ్యములే నీ జీవ భవము**
**యేకడను శ్రీవేంకటేశుఁడె నీవునికి**
**దీకొని నీ తీర్థమాడితిమ కావవమ్మా**

**శ్రీవేంకటాచలేతిహాసమాలలో వామనపురాణోక్తంగా**

**'ద్రవిడేషు మహాపుణ్య స్సేవితస్త్రిదశైర్గిరిః**
**తస్య శృంగేషు మహతీ పుణ్యాపాపవినాశినీ**



**స్వామిపుష్కరిణీ నామ సరసీ సర్వకామదా**
**త్రైలోక్య వర్తినాం బ్రహ్మం స్తీర్థానాం స్వామి నీహిసేతి**
**స్వామి పుష్కరిణీత్యేతన్నామధేయం చ తత్కృతమ్**
**మార్కండేయ సమస్తానాం తీర్థానాం స్వామినీయతే**
**స్వామిత్వస్య ప్రధానాచ్చ స్వామిపుష్కరిణీత్వయమ్**
**తీర్థానాం స్వామిభూతత్వాదుచ్యతే న్వర్థ నామతః'**

అని వర్ణితం.

**భూవరాహ దర్శనం:**

తిరుమలకు 'వరాహక్షేత్రమ'ని ప్రాచీననామం. ఆళ్వారులలో ఒకరయిన పేయాళ్వరు 'పురిందు మదవేwo' అనే పాశురంలో 'వేంగడమే మేలోరునాళ్ మణ్కోట్టు క్కొండాన్ మలై' అన్నారు. ఏనుగులు రాళ్ళలో తమ ప్రతిబింబాలు చూచి వేరే ఏనుగులని భావించి వాటితో పోరాడే వేళ, ఒరిపిడిచే తెల్లని దంతాల నుండి ముత్యాలు ఎక్కడ రాలుతున్నాయో ఆలాంటి వేంకటాచలం–పూర్వం తన కోరలతో జలార్ణవం నుండి భూమిని ఉద్ధరించిన శ్రీవరాహస్వామి వేంచేసిన పర్వతం అని వర్ణించారు.

తరిగొండ వేంగమాంబ శ్రీవేంకటాచల మాహాత్మ్యంలో శ్రీనివాసునితో వరాహస్వామి

ఈ పర్వతమున వృషభాసురుడు చేరి విడివడి శ్యామాక
ధాన్య మెందుండినఁదా గ్రహించి
కొనిపోవుఁగనుక నా క్రూరాసురునితోడ
బహుదినంబులు ఘోరబండనంబుఁ
జేయుచునుంటి; నమ్మాయ రాక్షసుఁడెందఁ
జిక్కకనే యుండి చిక్కెఁగనుక
వాని శిక్షించి యిచటికి వచ్చి నిన్నుఁ
జూచితి' అని వచించినట్లు వర్ణించింది.

ఆలాగే 'కలియుగాంతం దాకా కటిదేవః నేవసింపఁజోటు నీవు చూపు' అని వేంకటేశ్వరుడు ప్రార్థించాడట. పేదల కాశపెట్టగరాదు. వలనొప్పుగా బలవంతులకును తావీయరాదు. అంతేగాదు అర్థమొసంగక భూమినియ్య అని భీష్మించుకొన్నాడట. అప్పుడు స్వామి ప్రార్థిస్తే భూవరాహస్వామి సమ్మతించాడట. 'ముందువచ్చిన చెవుల కంటే వెనక వచ్చిన కొమ్ములు వాడి' అన్నట్లు కాలక్రమేణ వరాహస్వామిని దర్శించక సరాసరి వేంకటేశ్వరుని దర్శించడమే ప్రధానంగా మారిపోయింది.

కన్నడహరిదాసులు శ్రీవేంకటాచలయాత్రలో స్వామి పుష్కరిణి పవిత్రస్నానాంతరం వరాహస్వామి దర్శనాన్ని వర్ణించారు. ఉరగాద్రి వాస విఠలదాసులవారు 'నోటి బీగాల' వ్రతం పాటిస్తూ స్వామి పుష్కరిణి కాసారంలో పవిత్రస్నానం చేసి

**'బాగి వరహాదేవర వందిసి**

**బేగది హరకె కై కొండిస దేవనె'** అని వర్ణించారు.

'భూదేవియు రమణ ఆది శ్రీభూవరాహమూర్తియ శ్రీపాదయుగక్కె శరణు' అని శరణాగతి చేశారు.

ప్రసన్న వెంకటదాసులవారు

'సానురాగది శ్రీవరహగెనమిసి

తానఖిల పుణ్యవను సూరె గొళదననే' అని స్తుతించారు.

అంతేగాక 'స్వామి వరహవెంకటనాయక' అని నోరారా పిలిచి తన్మయులయ్యారు.

తమిళంలో వరాహస్వామిని 'జ్ఞానప్పిరాన్'గా సేవిస్తారు. అతడే ధరణీవరాహుడు, ఆదివరాహుడు. భూమిని తన కోరల మీద పెట్టుకొని ఉన్నట్లు కనిపించేమూర్తి. ఇదొక అరుదైన శిల్పమూర్తి. ఒక కాలు సర్పరాజు తలపై మరొకకాలు రసాతలంపై ఉంది. భూదేవి వక్షఃస్థలానికి స్వామి మూతి ఆనుకొని



ఉన్నట్లు కనిపించడం విశేషం. అమ్మవారి గుబ్బలతావిని, మోవి వంటి తేనియను ఆస్వాదించినట్లుగా చిన్నన్న వర్ణించాడు. అమ్మవారి మోము తామరకు స్వామి మోము దగ్గరగా ఉంది. ఆమె చేతులలోని తామరలు నిటారుగా ఆమె చెవులవరకూ ఉన్నందున తామరలను స్వామిభుజాలు తాకడం చేత, తామరలు అమ్మవారి చెవులను తాకాయి. ఈ చేతనే చిన్నన్న 'కేలి తామరలన శ్రుతి ద్వయము లంకించి' అన్నారు. పై చేతులలో శంఖ చక్రాలున్నాయి. కింది చేతులలో ఎడమచేయి అమ్మవారిని పొదువుకొని కనిపిస్తుంది.

తిరువరంగప్పెరుమాళ్ గారు కూడా తిరుమల యాత్ర చేసిన వేళ వేంకటాచల శైలం అధిరోహించి త్రోవలో నారసింహుని దర్శించి శ్రీస్వామి పుష్కరిణిలో స్నానం చేసి సకలానుష్ఠానములు పూర్తిచేసి

'వానత్తవర్కుమ్ అల్లాదవర్క్కుమ్ మత్తెల్లావర్క్కుమ్ ఇచప్పిరానై యల్లాల్లె నాన్ కుడ నల్లదువే-

దేవతలకును, మానవులకును, నరలోకవాసులకును, జ్ఞానవరాహస్వామి కన్న నేను కాంచిన మంచిదొకటి లేదని శ్రీవరాహస్వామికి మంగళాశాసనం చేసినట్లు 'తిరుమలైబళుగు' వర్ణించింది.

అంతేగాక వేంకటాచలేతిహాసమాలలో వామనపురాణోక్తంగా

**'తత్రాస్తే కోలరూపే తు**
**మహావిష్ణుః సనాతనః**
**ఉద్ధృతాం ధరణీం దేవీం**
**ఆలింగ్యాంకే విధాయ చ**
**ఆరాధితో మునిగణైః**
**త్రిసంధ్యం శ్రద్ధయాన్వితైః'** అని ప్రస్తావితం.

**అశ్వత్థ-తింత్రిణీవృక్షాలు:**

స్వామి పుష్కరిణికి దక్షిణపు గట్టుపైన పెద్ద చెట్టు ఉంది. ఆ చెట్టు కింద పెరిగిన పుట్టలో స్వామి ఎవరికి తెలియకుండా పదివేల సంవత్సరాలు నివాసం

చేశాడు. బ్రహ్మ ఆదేశం మేరకే ఆ చింతచెట్టు పెరిగింది. ఇది 'నీడ తిరుగని చెట్టు'గా ప్రసిద్ధి. ఈ అంశాన్ని చిన్నన్న పరమయోగివిలాసంలో కూడా

హికులపతి **'ఉత్తుంగ భాగమున**
**నా యహికులపతి యవతారమగుచుఁ**
**దిరుగని చింత కెంతే భక్తి మొక్కి'** అని వర్ణించాడు.

శ్రీవేంకటాచల మాహాత్మ్యంలో వెంగమాంబ 'దశంథుండే తింత్రిణీ వృక్షంబు. కౌసల్యయే వల్మీకం. లక్ష్మణుడే శేషపర్వతం అయోధ్యాపురం తద్భూధర పుణ్య కాననం. సరయూనదియే స్వామి పుష్కరిణి: రామచంద్రుడే వల్మీకవాసియైన శ్రీనివాసుండగుచుండు. తదంతరంబున వసుదేవుండే తింత్రిణీభూజంబు. దేవకీ దేవియే వల్మీకంబు బలభద్రుండే పన్నగాచలంబు. మధురాపురంబే వేంకటనగంబు. యమునానదియే శ్రీస్వామిపుష్కరిణి' అని వర్ణించింది.

'అశ్వత్థ వృక్షం' మహిమాన్వితమయింది. వేంకటేశ్వరుడు పార్వతీ, భారతీ ప్రముఖ సువాసినుల మధ్యంబున కూర్చుండియున్న లక్ష్మితో చెప్పక పుష్కరిణీ తీరస్థాశ్వత్థ వృక్షచ్ఛాయ యందు కూర్చుండి కుబేరుని దగ్గరికి పిలిచి ఏకాంతంగా డబ్బు అడిగాడట. చివరకు 'ఋణవ్యవహారం' ఒక కొలికికి వచ్చింది. వడ్డీ పత్రం సిద్ధమయింది. అందుకు అజరుద్రులు సాక్షులయ్యారు. సాక్షులు బేసిసంఖ్యలో ఉండాలనే నియమం కనుక 'అశ్వత్థుడు' కూడా సాక్ష్యమయ్యాడు.

కన్నడ హరిదాసులలో ఒకడయిన ఉరగాద్రివాసవిఠలదాసులవారు
తీర్థమహిమోపేత స్వామి పుష్కరిణీ
తట విరాజిత అశ్వత్థ వృక్ష రాజనిగె శరణు' అని నమస్కరించినవారే.

### బేడి ఆంజనేయస్వామి:

తిరుమల శ్రీవారి ఆలయానికి ఎదురుగా మిట్టపైగల స్వామి ఆంజనేయుడు. ఈ స్వామిని 'బేడి' ఆంజనేయులనడంవాడుక. రాముడు ఇక్కడే హనుమతో భేటీ అయ్యాడని ఒక కథనం. హనుమ అల్లరి చేస్తుంటే తల్లి బేడీలు తగిలించిందని ఇంకొక కథనం. అయితే కన్నడంలో 'బేడి' అంటే వేడుకోవడం. స్వామి సందర్శన భాగ్యం తమకు కల్గించమని కోరుకోవడం



ఈ నియమపాలనలో భాగం. అదీగాక ద్వైతమతానుయాయులకు 'హనుమ' ఆరాధ్యదైవం. విశిష్టాద్వైతులకు పెరియ త్తిరువడి. ఔత్తరాహులకు పౌరుషావ తారమూర్తి. స్వామి తనకంటె తమభక్తులే గొప్పవారని చెప్పడానికే మిట్టమీద నిలిపాడని అంటారు. స్వామి వేంకటరాముడు కనుక హనుమంతుని సన్నిధి అన్వర్థకం. ఈ స్వామిని అన్నమయ్య అనేకవిధాలుగా కీర్తించాడు.

ఈ ఆలయ ప్రాంగణంలోని గోవిందరాజాచార్యులు శ్రీమద్రామాయణానికి 'గోవింద రాజీయమనే' వ్యాఖ్యానాన్ని సంతసించారని ప్రతీతి. ప్రతి బ్రహ్మోత్సవంలోనూ ప్రభుత్వ లాంఛనాలమేరకు వస్త్రం తీసుకెళ్ళడం ఇక్కడనుండే మొదలవుతుంది.

### గరుడగంభం:

ఇది ఒకప్పుడు తిరుమల శ్రీవారి ఆలయంలో వెండివాకిలి దాటాక గరుడాళ్వార్ సన్నిధి ఆనుకొన్నట్టుగా ఉండేది. క్రమంగా ఎన్నోచోట్ల మారి ప్రస్తుతం బేడి ఆంజనేయుల సన్నిధిలో నిలిచివుంది. కొబ్బరికాయలు కొట్టడం, సామాన్య ముడుపులు చెల్లించడంలాంటివి ఇక్కడే కొనసాగిస్తారు.

అన్నమయ్య 'సేవించి చేకొన్నవారి చేతి భాగ్యము కీర్తనలో

**'గరుడగంభము కాడ కడుఁబ్రాణాచారులకు**
**వరము లొసగేని శ్రీవల్లభుడు'** అని కీర్తించాడు.

దీనినే 'అఖండం' అని కూడా అంటారు. ఇక్కడ నాలుగు దీపస్తంభాలున్నాయి. సుమారు 6 అడుగుల ఎత్తుగల ఈ పంచలోహస్తంభాలకు ఒకదానిపై చక్రం, రెండవ దానిపై గరుడాళ్వార్, మూడవ దానిపై హనుమంతుడు, నాల్గవ దానిపై శంఖం శిల్పాలున్నాయి.

తిరుమలలో శ్రీవారి ఆలయంలో కూడా దీపం ఆరిపోకుండా వెలగాలని భక్తుల ఆకాంక్ష. నేతి దీపాల వాడుక తిరుమలలోనే. ఆ కారణం వల్లనే ఎందరో మహానుభావులు స్వామికి ఆవులు అర్పించారు. గోపోషణకు తగిన వ్యవస్థ

కల్పించారు. అంతేగాక నవరాత్రులలో బ్రహ్మోత్సవం జరిగే రోజులలో భక్తులు తమ ఇంట 10 రోజులు దీపాలు వెలిగేలా చూస్తారు. ఒక వేళ సాధ్యపడనప్పుడు కొంత డబ్బును తి.తి.దే వారికి ఎం.ఓ.ద్వారా పంపేవారు. వారికి శ్రీవారి ప్రసాదం అందేది కూడా. ఏది ఏమయినా గరుడగంభం దగ్గర కూడా దీపాలు వెలుగుతూనే ఉంటాయి.

**తిరుమల శ్రీవారి ఆలయంలో సామాన్య యాత్రీకులు సందర్శించుకోవడానికి వీలయిన ప్రదేశాలు:**

**పడికావలి:-**

దీనినే 'పెరియ తిరువాశల్' అని తమిళులు వ్యవహరిస్తారు. పెద్దవాకిలి అని అర్థవిశేషం. ఈ గోపురం ఎత్తు 50 అడుగులు. పెద్ద గోపురమే మొదటి గోపురం. ఈ గోపురాన్ని తొండమాన్ చక్రవర్తి స్వామి ప్రేరణతో నిర్మించినట్లు ఐతిహ్యం. క్యూ కాంప్లెక్స్ మార్గం ద్వారా వచ్చేవారు. ప్రత్యేక ప్రవేశద్వారం ద్వారా వచ్చేవారు. మహాద్వారం ప్రవేశం గలవారు ఇక్కడ ఎపుడూ స్రవించే నీటితో పాదప్రక్షాళన చేసి ఆలయంలో ప్రవేశించడం సంప్రదాయం.

**అనంతాళ్వాన్ 'గడ్డపార':**

పడికావలి దాటగానే కుడివైపు గోడమీద కనిపించే 'గునపం' అనంతాళ్వాన్ గునపం. అనంతాళ్వాన్ రామానుజుల ఆదేశంతో పుష్పకైంకర్యం నిమిత్తం తిరుమలకు భార్యతో వచ్చిన వైష్ణవుడు. తోటలోని పూలచెట్లకు నీరు పారడానికి అనువుగా ఒక చెరువు త్రవ్వించడానికి సంకల్పించిన కైంకర్యశీలి. తన సేవలో తన భార్య తప్ప మరొకరు పాలుపంచుకోవడం ఇష్టం లేని వ్యక్తి. అయినా స్వామి పసిబాలుడై తాను సహకరిస్తానని ప్రార్థించినా లాభం లేకపోయింది. చివరకు అనంతాళ్వాన్ భార్య బాలుని సహకారానికి ఆమోదం తెలిపింది. ఇందుకు మరొక కారణం ఆమె 'గర్భవతి' కావడం. చెరువు త్రవ్వకం పని త్వరితంగా సాగుతుండడంతో అనంతాళ్వాన్ సందేహించి కళ్ళెత్తి చూడగా బాలుడు కనిపించాడు. అతనిని పట్టుకోబోయి కుదరక గునపం వేశాడు. ఆ



గునపం స్వామి చుబుకానికి తగిలింది. సాయంత్రం వేళ అనంతాళ్వాన్ గుడిలో స్వామి చుబుకం నుండి రక్తం స్రవించడం చూసి ఉదయం కనిపించిన బాలుడు శ్రీనివాసుడని పరితపించాడు. స్వామి ఊరడించి తన్ను కొట్టిన తనపై విసిరిన 'గునపం' అందరు తిలకించేలా గోడమీద వేలాడదీయమన్నాడు. ఈ వృత్తాంతం వేంకటాచల ఇతిహాసంలో ఉంది.

అన్నమయ్య అనుభూతితో ఈ వృత్తాంతాన్ని కీర్తనల్లో విశదం చేశాడు కూడా.

**అనంతాళువారి చెఱువు గట్ట**
**మన్నుమోయగాఁదెలిసె మీ నటనలు**

**కొండలలో నెలకొన్న కోనేటి రాయడువాడు**
**కొండలంత వరములు గుప్పెడువాడు॥**

**అచ్చుపు వేడుకతో అనంతాళువారికి**
**ముచ్చిలి వెట్టికి మన్ను మోచినవాడు**
**మచ్చిక దొలక తిరుమలనంబి తోడుత**
**నిచ్చ నిచ్చ మాటలాడి నచ్చినవాడు॥**

**తులాభారప్రదేశం:**

తిరుమలరాయ మండపానికి దగ్గరగా 'త్రాసు' కనిపిస్తుంది. సంస్కృతంలో త్రాసును 'తుల' అంటారు. ప్రాచీనకాలంలో రాజులు 'తులాపురుషదానం' చేసేవారట. భక్తులు రోగాలు తగ్గగా, సంతాన భాగ్యం సిద్ధించగా తాము మొక్కుకున్న తీరులో ధనం మున్నగునవి చెల్లిస్తారు. తమ బరువుకు లేదా తమసంతానం బరువుకు తగ్గట్టుగా తూచి కానుకగా శ్రీవారికి ఇక్కడ సమర్పిస్తారు. అవసరమయితే దేవస్థానం వారే 'నాణాలు' సమకూరుస్తారు. 'తులాభార రహస్యం' కేవలం నాణేల సమర్పణ కాదు. ఆలయ ప్రవేశం వేళ ప్రతి భక్తుడు తన్ను తాను బేరీజు చేసుకోవడం. సమచిత్తంతో ఆలయంలో

అడుగుపెట్టడమే ధ్యేయం. 'సమబుద్ధే యందరికి సర్వవేదసారము' అని అన్నమయ్య వినుతించాడు.

**ధ్వజస్తంభం:**

దీనినే 'గరుడగంభం' అని కూడా అనేవారు. బ్రహ్మోత్సవ కాలంలో గరుడపటం కట్టి పైకి ఎత్తడం కారణం కావచ్చు. బంగారు రేకుల తాపడంతో నిగనిగలాడే స్తంభం ఇది. 'గరుడ ప్రతిమ' కనబడడం విశేషం. 'తెంగెలై' నామం కాక 'వడగలై' నామం ఉండడం చిత్రం.

'వ్యాసవిఠలదాసులు' గరుడకంభం చుట్టు అనేక విధాలుగా వైభవం అవిష్కృతమయ్యేలా సిరిమగనికి కంకణంకట్టారు అని

'గరుడా కంభవ సుత్తా పరిపరి వైభవదింద

శిరియా వెంకటగే కంకణ కట్టిద రాగా' అని అలంకరణను వర్ణించారు.

ఉరగాద్రివాస విఠలదాసులు

'సర్వగుణసంపూర్ణ వైకుంఠ మందిరన

సర్వమయ సువర్ణ స్తంభక్కె శరణు' అన్నారు.

అంతేకాదు బహిరావరణప్రదేశాన్ని కూడా

'బ్రహ్మాండ దొడెయవ దివ్యనిలయ దొళెరువ

బహిరావరణక్కె శరణు' అని సాగిలబడ్డారు.

తిరుమల వైకుంఠమందిరం, సర్వగుణసంపూర్ణం. అక్కడి బంగారుస్తంభానికి శరణు అన్నారు. ఆలాగే బహిరావరణానికి కూడా శరణాగతి చేశారు.

**వెండివాకిలి:**

తలుపులకూ, వాకిలికీ వెండి తాపడంతో కనిపించే వాకిలి. దీనినే 'నడిమి పడి కావలి' అంటారు. ఈ ద్వారంలో మహంతు బావాజీ, శ్రీవేంకటేశ్వరస్వామి పాచికలాడుతున్న శిల్పం ఉంది. తలుపులపై దశావతారాల మూర్తులున్నాయి.



స్వచ్ఛమైన హృదయంతో ఆలయంలో ప్రవేశించాలని ఈ వెండివాకిలి సూచిస్తుంది.

**రంగనాథస్వామి:**

వెండి వాకిలి దాటి లోనికి ప్రవేశించిన వెంటనే ఎదురుగా శేషశాయి అయిన శ్రీరంగనాథస్వామి దర్శనమిస్తాడు. ఈ చిన్న విగ్రహమూర్తికి పై భాగంలో శ్రీవరదరాజస్వామి, క్రింది భాగంలో శ్రీవేంకటేశ్వరస్వామివారి మూర్తులు చోటు చేసుకున్నాయి. ఈ మూడు మూర్తులు వైష్ణవులకు అత్యంత ప్రధానమైన శ్రీరంగం, కంచి, వేంకటాచల దివ్య క్షేత్రాల ప్రాధాన్యాన్ని తెలుపుతున్నాయి. భక్తులు ప్రతిరోజు తెల్లవారు జామున ఈ రంగనాథుని దగ్గరి నుంచే అంగప్రదక్షిణ చేస్తారు. దర్శనానంతరం కూడా భక్తులు ఇక్కడే సాష్టాంగదండ ప్రణామాలాచరిస్తారు.

**వరదరాజస్వామి:**

విమాన ప్రదక్షిణమార్గంలో ఆగ్నేయమూలన శ్రీవరదరాజస్వామి ఆలయం వుంది. ఈ గుడిలో (సుమారు 4 అడుగుల) నిలువెత్తువున్న శ్రీవరదరాజస్వామి వారి శిలామూర్తి ప్రతిష్ఠింపబడింది.

శ్రీవైష్ణవులకు శ్రీరంగం, కంచి, తిరుమల పవిత్ర క్షేత్రాలు, దర్శనీయ స్థలాలు. కంచిలోని స్వామికి 'వరదరాజు' అని పేరు. తిరుమలలో కూడా వరదరాజును సేవించడానికోసం ఈ ఆలయం నిర్మితమని పెద్దలంటారు.

ప్రతిరోజూ మూడు పూటలా ఈ స్వామివారికి నివేదనలు జరగడమేగాక ప్రతి సంవత్సరం వరదరాజ జయంతినాడు విశేషంగా అభిషేకార్చన నివేదనలు ఘనంగా జరుగుతాయి.

**మహామణిమంటపం:**

'మణి' అంటే తమిళంలో ఘంట. మహామణి అంటే పెద్ద ఘంట. పెద్ద ఘంటలు కట్టిన చోటు మహామణిమంటపం. సాధరణంగా ఆలయాలలో ఒక

ఘంట ఉంటుంది. తిరుమలలో రెండు ఘంటలున్నాయి. ఒకటి నారాయణ ఘంట, రెండవది గోవింద ఘంట. ఒకప్పుడు చెరోవైపు ఉండేవని తరువాత ఒకచోట చేర్చారని పెద్దలు చెబుతారు.

ఆలయానికి 'గంట' ప్రధానం. ఈ ఘంటా నినాదం ఆలయంలో పూజలు జరుగుతున్నాయని తెలియజెప్పడానికి, నివేదన జరుగుతుందని అర్థం చేసుకోవడానికి. లోపల పూజాదులలో వాడే గంట వేరు. ఈ గంటల నినాదం గంటామంటపం సోకగానే ఆ గంటలు మ్రోగేవని, ఆ నినాదం ఆలించి చంద్రగిరి రాజులు ఆపై భుజించేవారని ప్రతీతి. హరపన హళ్ళిభీమవ్వ 'వెంకోబ' అయిన శ్రీనివాసుని కనులార దర్శించి పవిత్రు రాలనయితినంటూ అనేకాంశాలతో

'అన్నపూర్ణెయనోడె అధిక గంటియనాద

ఎన్న కివిగా నందవో దేవ'

'రకరకాల ప్రసాదాల పాత్రలను చూచా' చెవులకింపయిన గంటనాదరవళిని విన్నాను' అని పరవశంతో వర్ణించింది.

**జయవిజయులు:**

ఇతర వైష్ణవాలయాలలో శిలామూర్తులయిన జయ, విజయులు కనిపిస్తే తిరుమలలో లోహమూర్తులై కనిపించడం విశేషం. వైఖానసులు ఈ విగ్రహాలను 'చండ ప్రచండుల'ని పేర్కొంటారు. ఆలయంలో ప్రవేశించే భక్తులు శుచిగా ఉండాలని సూచించడం ఒక ప్రత్యేకాంశం. పది అడుగుల ఎత్తు ఉన్న ఈ లోహమూర్తుల ప్రతిష్ఠ ఎప్పుడు జరిగిందో తెలియదు. ఈ విగ్రహాల చుట్టూ బంగారు కటాంజనం అమర్చబడింది. ప్రస్తుతం మహాలఘుదర్శనం ఇక్కడి నుండే అమలు చేయబడుతున్నది.

**స్వామి సందర్శనం:**

ప్రపంచంలో ప్రత్యేకించి ఆలయాలలో ఎన్నో విగ్రహమూర్తులుండవచ్చు కాని 'శ్రీనివాస విగ్రహానికున్న' ఆకర్షణ, అందచందాలు ఇతర విగ్రహాలకు లేవనే చెప్పాలి. సుప్రభాతంలో కూడా సర్వావయవ సౌందర్య అని వర్ణితం. నిలబడిన స్వామిని శిరసునుండి చూడాలని పెద్దలంటారు.



'రవికోటి కిరణ రత్న కనకమయ మకుటాన్వితం' ఆ స్వామి శిరము. ఇందుమండల భాస మందస్మితసుందరానందవదనము ఆతని మోము. లోలవిశాల ఫాలకస్తూరీ తిలకాంకితుడాస్వామి. చంపకసుమ సదృశము ఆ దేవదేవుని నాసిక. కనకరత్న మణిఖచిత మకరకుండలాన్వితం అతని కర్ణాభరణం. ఆ ఒడయుడు కౌస్తుభాభరణయుక్త కంఠుడు. జగచ్చక్రాధిపతి, నక్రసంహారి, విక్రమశీలి, సుదర్శనధారి, శ్రీవత్సలాంఛనుడు. కనక రత్న హార పదక మౌక్తికాహార కల్హార పుష్పమాలాలంకృతుడు. పట్టు పీతాంబరధారి. త్రివళిహారశోభితుడు. అభయహస్తుడు' అయిన స్వామిని దర్శించడంలోగల అనుభూతి అనన్యసామాన్యం. కష్టాల కడలిలో మునిగినవారికి తన పాదమే శరణమని ప్రదర్శించే భంగిమ చిత్రాతిచిత్రము.

ఆపాద కేశాంతంగాని, ఆశిరః పాదాంతంగాని దర్శించడానికి ప్రస్తుతం వీలు లేకున్నా క్షణమాత్రం దర్శించడమే భక్తులు పెనుపండువుగా భావిస్తారు. కులశేఖరప్పడి దాకా వెళ్ళగలిగినవారు స్వామిని ఒక మేర దర్శించగలరు. లఘుదర్శన సౌలభ్యం పొందినవారు దూరంగా కూడా ధగద్ధగాయమానమూర్తిని దర్శించగలరు.

ఆలయంలో పంచబేరాలున్నాయి. వాటిలో ధ్రువమూర్తి ప్రధానం. మలయప్ప ఉత్సవమూర్తి. స్వామిని వర్ణించడం సాధ్యం కాని అంశం. ప్రతి కైంకర్యంలోనూ కొత్తగా కనిపించేమూర్తి. ప్రత్యేకించి శుక్రవారం నాటి "స్వామి" త్రిజగన్మోహకం, తాళ్లపాకకవులు ఈ అందచందాలను రమణీయంగా వర్ణించారు.

**"కంటి శుక్రవారము గడియ లేడింటె**

**అంటి అలమేల్మంగ అండనుండే స్వామని"**

**వకుళమాత:**

మహాలఘుదర్శనం చేసుకున్న యాత్రికులు దారిలోని పెనుగంటలను చూస్తూ ఆవరణ దాటి బంగారు బావిని పరిశీలిస్తూ మెట్లెక్కి వకుళమాలిక

ఉన్న వంటశాలను చేరుకుంటారు. ఈ తల్లికి 'పచనలక్ష్మి', వకుళాదేవి, వకుళమాలిక, మడప్పళ్ళి నాచ్చియార్ అని పేర్లు.

ద్వాపర యుగంలో శ్రీకృష్ణుని పెంచి పెద్ద చేసిన యశోదాదేవి, శ్రీకృష్ణునికి పెళ్లిచేసి సంతోషించలేకపోయాను కదా! అని చింతించిందట. శ్రీకృష్ణుడు ఆమెను ఓదారుస్తూ, కలియుగంలో తాను శ్రీనివాసునిగా అవతరించినపుడు వకుళమాతగా తనకు కళ్యాణం చేసే భాగ్యాన్ని పొందగలవని వరమిచ్చాడు. ఆనాటి యశోదే ఈ వకుళాదేవి. ఇది ఐతిహ్యం ఆగమశాస్త్రరీత్యా ఈ అమ్మవారిని 'పాకలక్ష్మి'గ పిలుస్తారు.

**తీర్థం-శఠారుల వినియోగం:**

ఒకప్పుడు కులశేఖరపడి దగ్గరే తీర్థశఠారులు అనుగ్రహించేవారు. కొంతకాలం దాకా శయన మండపం దగ్గర ఈ సమర్పణ ఉండేది. రద్దీ దృష్ట్యా క్రమంగా వకుళమాత దర్శనం చేసుకున్నాక బయటకు కదలివచ్చే మేడపై భాగంలో ఈ సౌకర్యం కల్పించబడింది. ఇక్కడి విగ్రహాలు ఒకప్పుడు గుడిలోపలి రామర్‌మేడులోనివే తమిళంలో 'మేడు' అంటే ఎత్తైన ప్రదేశం. ఈ మేడులోని విగ్రహాలు ప్రస్తుతం తీర్థాదులున్నచోట దర్శించవచ్చు. రాములవారి పరివారమైన అంగద, హనుమంత, సుగ్రీవుల విగ్రహాలు ఈ ప్రదేశంలో దర్శించవచ్చు. ఈ విగ్రహాలను ఎవరో ఒక భక్తుడు రామానుజులవారికి ప్రసాదించాడని పెద్దల ఐతిహ్యం. ఈ ప్రదేశం దాటాక బ్రహ్మోత్సవ సందర్భాలలోను ప్రతినిత్యం నిర్వహించే యాగశాల అట్లే ఒకప్పుడు కళ్యాణాలు జరిపే కళ్యాణ మండపం ఆపై స్వామికి ఉత్సవాలకు అవసరమయ్యే చందనాన్ని అరగదీసే సానరాళ్లు కనబడతాయి.

తిరుమలలో 'శ్రీవారి తీర్థం' భక్తులకెంతో ప్రీతికరం. కాశీకి వెళ్ళినవారు 'గంగాతీర్థం' తెచ్చినట్లే తిరుమల దర్శనం చేసుకొన్నవారు 'స్వామితీర్థాన్ని' తమవారికి ఇవ్వడానికి తీసుకొని వెళ్ళడం ఆచారంగా ఉండేది. కాని ప్రస్తుతం అందరికి ఈ అవకాశం లేదు. ఒకప్పుడు 'ప్రసాదాలు' లాగే తీర్థం కూడా అమ్మేవారేమో!



వ్యాస విఠలదాసరు 'జయ జయ వెంకటరమణ' పాటలో

**ఇప్పత్తు దుడ్డిగె శేరు తీర్థవ మారి**

**దుడ్డు కట్టి జాళిగె ఫళిసువ జాణనీనో** అని ఇరవైదుడ్డు (పాత నాణేలకు)లకు శేరు (లీటరంత) తీర్థం అమ్మడాన్ని వర్ణించారు.

**విమాన వేంకటేశ్వర సన్నిధి:**

ఆనందనిలయంలోని మూర్తులలో విశిష్టం అవశ్యదర్శనీయం 'విమాన వెంకటేశ్వరస్వామి' ఈ స్వామిని కన్నడిగులు చాల చోట్లు స్మరించారు. వ్యాసరాయలవారు తిరుమలేశుని కైంకర్యం చేసినవేళ ఈ స్వామిని పునః ప్రతిష్ఠ చేశారని ఐతిహ్యం.

విజయదాసులు 'హేమగోపురది విమాన శ్రీనివాస దేవరను నోడి నమిసి' అని స్తుతించారు. ఉరగాద్రి విఠలదాసులు 'సుమనసరు హృన్మది ధ్యానిసువ కాంచన విమానదలి చెళగుతిహ శ్రీనివాసనిగె శరణు' అన్నారు. గురుగోవింద విఠలదాసులు 'భూమిపతి వరాహస్వామి పుష్కరిణ్యాది ఆ మహాతీర్థగళ వీమానస్థితనా' అన్నారు. ప్రసన్న వెంకటపతి దాసులు 'భూమిపతి వరాహస్వామి పుష్కరిణ్యాది ఆ మహాతీర్థగళ వీమానస్థితనా' అన్నారు. ప్రసన్న వెంకటపతి దాసులు 'భూవరాహస్వామియ సన్నిధిలి శ్రీవత్సలాంఛనీహ శ్రీవిమానదసహిత దేవాదిదేవతానిల్లిసింత' అని కొనియాడారు. ఈ మూర్తి దర్శనం మూలమూర్తి దర్శనంతో సమానమని, సర్వపాపహరమని, సర్వశుభదాయకమని భక్తుల భావన.

**'తత ఆనందనిలయే తొండమాన్ నృపనిర్మితే**
**విమానాగ్రే శ్రీనివాసో రరాజ భగవాన్ హరిః**

**హుండి:**

భక్తులు కానుకలు సమర్పించే స్థలం. ఇది 'డమరుకం' ఆకారంలో ఉంది. కింద 'గంగాళం' పైన గట్టిగా బిగించినవస్త్రం. ఇది స్త్రీ ఆకారంగా కూడా కనిపించడం విశేషం. అమ్మవారు అప్రత్యక్ష రూపంలో ధనం అందిస్తూ స్వామి

పూజలు జరిగేలాగున చూస్తుందని కొందరి కల్పన. హుండి వల్ల వచ్చిన ధనకనకరత్న రాశులంతా ఆచార్యులయిన రామానుజులకు స్వామి సమర్పిస్తున్నాడని వైష్ణవులు నమస్కరిస్తుంటారు.

స్యమంతకమణి కారణంగా కృష్ణునికి నిందరాగా, ఆ నింద తొలగించుకొని విలువయిన వస్తువు ఎవరిదగ్గరవున్నా నిందలు తప్పవని బాణంతో ఆ మణిని ఎగరకొట్టాడని ఆ బాణం ప్రస్తుతం హుండీవున్న స్థలంలో పడిందని, మణి సహజమయిన బంగారం ఉత్పత్తి అవుతుందని కూడా కొందరు చెబుతారు.

ఏది ఏమయినా భక్తులు తమ కోరికలు తీరగా కానుకలు సమర్పించడం నిజం. పాతకాలంలో 'హుండి' లేదంటారు. పురందర విఠలుడు 'తప్పుగాణికె కప్పగళను సప్తద్వీప గళింద తరిసువ' అని సప్తద్వీపవాసులనుండి వచ్చే కానుకల్ని అక్షరబద్ధం చేశాడు. ఆలాగే మరో కీర్తనలో

**'కాశీ రామేశ్వర దింద లిల్లి**
**కాణికె బరువదు చంద'** అని కాశీరామేశ్వర పర్యంతం గల భూభాగాల నుండి కానుకలు రావడం వింత అని అచ్చెర్వు పడ్డాడు. వ్యాసవిఠల దాసులు 'జయ జయ వెంకటరమణ' కీర్తనలో

**'బడవ బల్లిదరెందు చిడదాలె అవరింద**
**ముడుపు హోకిల కొండు ముందకె బిడవోదేవా'**

పేదవారయినా వదలిపెట్టక వారి చేత ముడుపులు కట్టించి ఆ ముడుపులు అందినగాని విడువని దేవుని వినుతించాడు.

ఒకవేళ కానుకలివ్వడం మరచిపోయినా తక్కువ సమర్పించినా వదలిపెట్టక వడ్డీతోసహా వసూలు చేసేవాడని పురందరదాసు

**"కాసు తప్పిదరె పట్టి బడ్డి**
**కాసు బిడదె గంటు కట్టి**
**దాసనెందర బిడగట్టి నమ్మ**
**కేసక్కి తిమ్మప్ప సెట్టి"** అని చమత్కరించారు.



ప్రసన్న వెంకట దాసులవారు 'వెంకటేశన మహిమేయాహొగళువా' అనే కీర్తనలో

**'తప్పదె నుడిదందను, ముడిపిన**
**కప్ప వెణిసికొంబను**
**ఛప్పన్న దేశస్థరు బందు స**
**మర్పణె మాడువరు'** అని చెప్పారు.

దేశవాసుల కానుకలను ప్రస్తావించారు. మాటతప్పనివాడు కప్పములు (కానుకలు) లెక్కించేవాడు. వరాలు కుప్పించేవాడని కూడా వర్ణించారు.

ఆంధ్రులయితే వడ్డికాసులవాడా! ఆపదమొక్కులవాడా! అంటూ రకరకాల కానుకలు అర్పించడం సహజం. ఎక్కువ మొత్తమయితే ఉన్నతాధికారులకు ఇవ్వడం ప్రస్తుతం వాడుకలో ఉంది. ఆలాగే స్వర్ణకిరీటాలు, ఆభరణాలు ఉన్నతాధి కారులకు సమర్పించడం కూడా అలవాటే.

**తాళ్లపాక అర:**

'సభేర' అని చెప్పబడే (సభ-అర) గది దాటగానే కనిపించే అర తాళ్ళపాకవారి అర. దీనినే రాగిరేకుల అర అనికూడా అంటారు. సభేరాలు స్వామివారి హారతి పళ్ళాలు, వెండి దివిటీలు, పట్టు వస్త్రాలు భద్రపరచినట్లే ఈ భాండారంలో తాళ్ళపాక కవుల సంకీర్తనల రేకులు భద్రపరచబడి ఉండేవి. ప్రపంచంలో ఎక్కడగానీ ఇంతటి సాహిత్యం రాగి రేకుల్లో చెక్కబడడం వినూత్నాంశం. ఈ అరలోపల వరిపోట్టులు రాగిరేకులుండేవి. శ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రిగారి చొరవతో, ఆపై ప్రభాకరశాస్త్రి గారి సంకల్పంతో తాళ్ళపాకవారి సంకీర్తనలు బయటపడ్డాయి. ఈ భాండారం పై అన్నమయ్య, ఆయన కుమారుడు పెద తిరుమలయ్యల శిల్పమూర్తులు మలచబడ్డాయి. ఒకప్పుడు ఈ చోట విశేషపూజలు జరిగేవి. సాహిత్యాభిమానులు పరవశంతో నిలిచి చేతులు జోడించి నమస్కరించవలసిన భాండాగారం ఈ తాళ్లపాక అర.

**చిన తిరుమలాచార్యుని కీర్తన:**

**నిన్ను ధ్యానము చేసీ నిచ్చనిచ్చఁదాళ్లపాక**
**అన్నమయ్యఁగా రెదుట నదిగోవయ్యా**
**పన్ని యాతనినే చూచి పాతకులమైన మమ్ము**
**మన్నించవయ్య వో మధుసూదనా**
**సంకీర్తనలు చేసే సారెఁదాళ్లపాకన్నయ్య**
**అంకెల నీ సన్నిధినే అదిగోవయ్యా**
**అంకించి నే వారివాఁడనని దుష్టుఁడనైనా నా**
**సంకె దీఱఁగావవయ్య సర్వేశ్వరా**
**పాదాలందున్నాఁడు తాళ్లపాక అన్నమయ్య మీకు**
**ఆదరాన ముక్తుఁడై అదిగోవయ్యా**

అన్నమయ్యకున్న శ్రీనివాసభక్తి అనన్య సామాన్యం. 32వేల కీర్తనలు వ్రాసినా చివర అతడు కోరుకున్న విన్నపం-

**"దాఁచుకో నీ పాదాలకుఁదగ నేఁజేసినపూజలివి**
**పూఁచి నీకీరితి రూపపుష్పములివి యయ్యా**

**ఒక్క సంకీర్తనే చాలు వొద్దికై మమ్ము రక్షించఁగ**
**తక్కినవి భండారాన దాఁచి వుండనీ**
**వెక్కసమగు నీ నామము వెల సులభము ఫలమధికము**
**దిక్కై నన్నేలితి వింక నవి తీరనినాధనమయ్యా॥**

**ఈ మాట గర్వము గాదు నీ మహిమే కొనియాడితిఁగాని**
**చేముంచి నా స్వాతంత్ర(త్ర్య?)ము చెప్పినవాఁడఁగాను**
**నేమానఁబాడేవాఁడను నేరము లెంచకుమీ**
**శ్రీమాధవ నే నీ దాసుఁడ శ్రీవేంకటేశుఁడవయ్యా"॥**



**సన్నిధిభాష్యకారులు:**

సంకీర్తన భాండాగారానికి ప్రక్కగా, హుండీకి ఎదురుగా "సన్నిధి భాష్యకారులు" వున్నారు. భగవద్రామానుజులవారినే 'భాష్యకారుల'ంటారు. శ్రీవారి సన్నిధిలో వున్నందువల్ల 'సన్నిధి భాష్యకారుల'ని ప్రసిద్ధి ఏర్పడింది. తిరుమలక్షేత్రాన్ని చక్కగా తీర్చిదిద్దిన ఘనత శ్రీరామానుజులవారిదే.

ఈ చిన్నమందిరంలో వ్యాఖ్యాముద్రతో ఉన్న రామానుజులవారి మూలమూర్తి, పంచలోహ ఉత్సవమూర్తులు ఉన్నాయి. ప్రతిపూటా శ్రీస్వామివారికి నివేదింపబడిన ప్రసాదాలు భగవద్రామానుజులవారికి మళ్లీ నివేదిస్తారు.

దేశంలో వున్న అతిచిన్న వయసు కలిగిన రామానుజ విగ్రహంగా చెప్పబడుతున్న ఈ మూర్తిని, స్వయంగా భగవద్రామానుజులవారే ఆ విగ్రహాన్ని ఆలింగన చేసుకొని అనంతాళ్వారులకు అందజేశారట.

శ్రీరామానుజులు తొలిగా తిరుమలకు మోకాళ్ళతో ఎక్కుతూ మోకాళ్లమిట్ట దగ్గర కొంత విశ్రాంతి తీసుకోగా, ఆ స్థలంలో ఒక రామానుజుల విగ్రహం ప్రతిష్ఠింపబడింది. ఈ మూర్తిని "త్రోవ భాష్యకారు"లంటారు.

సన్నిధి భాష్యకారులకు ప్రతి నెలా ఆర్ద్ర నక్షత్రోత్సవం, ప్రతి సంవత్సరం భాష్యకారుల జయంతి విశేషంగా జరుపబడుతున్నాయి.

**అన్నప్రసాదం:**

తిరుమలలో తమ కోసం వంటచేసుకోవడం, తినడం నిషిద్ధం. ఆలయంలో తయారుచేయబడిన దానిని, లభించిన దానిని ప్రసాదంగా గ్రహించి జీవనయాత్ర సాగించాలని నియమం. తరువాతి కాలంలో జనసాంద్రత ఎక్కువ కావడంతో ఆయా మతస్థుల ఆచార వ్యవహారాలకు అనుగుణంగా మఠాదులు వచ్చాయి. అయినా సామాన్య జనావళికి అందుబాటులో ఉండేటట్లు ప్రసాద వినియోగం మొదలైందని చెప్పాలి. ఈ నెపంతో స్వామి వారి పేర రకరకాల ఉత్సవాలు, వాటికి తగినట్టు ఆలయం వెలుపల 'లడ్డు' ప్రసాదం టోకన్లు గలవారికి లభ్యమవుతుంది. ఒకప్పుడు లడ్డుప్రసాదం లేదని అంటారు. అయినా తరువాతి

కాలంలో వచ్చిన ఈ 'లడ్డు' జగత్ప్రసిద్ధి కావడం విశేషం. తిరుపతి యాత్రకు వెళ్ళి వచ్చామంటే 'లడ్డు తెచ్చారా' అని అడగడం పరిపాటి.

అన్నప్రసాదాల వరకు 'ఓడు' ప్రసాదం ప్రసిద్ధం. ఈ ప్రసాదాల గురించి తాళ్లపాక కవులు, హరిదాసులు అనురక్తితో వర్ణించారు. ఒకప్పుడు తిరుమలలో మట్టి పాత్రలలోనే వంటకం తయారీ ఉండేది. ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం కురువరతినంబి అనే కుమ్మరి వాని కథ. దొన్నెలలో, ఆకులలో ప్రసాదస్వీకారం కన్న కుండపెంకులో ప్రసాద స్వీకారం శ్రేష్ఠం. కుండపెంకులో ప్రసాదం పంపిణీజరిగేరోజులలో 'ఓడు' ప్రసాదం వినియోగంలో ఉండేది. తమిళంలో 'ఓడు' అంటే పెంకు. మట్టితో తయారు చేసిన కుండపెంకులో ప్రసాదం ఇవ్వడమనే అర్థంలో 'ఓడు ప్రసాదం' వినియోగంలోకి వచ్చింది. కాలక్రమేణ మార్పులు వచ్చాయి.

**"ఉప్పు ఓగరగళనె మారిసి**
**ఉచిత దిందలి హరావ గళిసువ"**

'ఉప్పు' అన్నప్రసాదాలలో నియతం. ఓగిరం అంటే ఆహారపదార్థం అని ప్రసాదాల అమ్మకాన్ని పురందరదాసులవారు వర్ణించారు.

'అన్న వెల్లవ మారి హన్నువట్టువెయల్లా'

అని వ్యాసవితలరాయలు ప్రసాదాల అమ్మకాన్నీ వర్ణించారు.

కనక దాసుల వారు అప్పాలు, అతిరసాలు, నేతి కజ్జాయము, ఏలకులు, శొంఠి, మిరియాలు మొదలయిన వానితో చేసిన ప్రసాదాలు

'కజ్జాయ రాశులను ఛప్పన్న దేశాలకు అమ్మే సెట్టి'యని నిందాస్తుతి చేశారు.

తిరుమలలో 'మిరియాలకే' ప్రాధాన్యం. తమిళంలో 'మిళగు' అంటే మిరియాలు. 'మిళగు ఓగిరై' మిరియాలతో చేసిన ఆహారపదార్థం. క్రమంగా తిరుమలలో 'మిరపకాయల' వాడకం పెరిగింది. అయినా 'పొంగల్' లాంటి



వాటిల్లో 'మిరియాలకు' ప్రాధాన్యం. చేసిన పదార్థం భక్తాదులకు పంపిణీ చేయడానికి వీలుగా పులిహోర (చింతపండుగొజ్జు కలిపి చేసిన ఆహారపదార్థం) దధ్యోదనం (పెరుగన్న ప్రసాదం) లాంటివి వాడుకలో వచ్చాయి.

తమిళులు, కన్నడిగులు, తెలుగువారి సంప్రదాయాలకు అనుగుణంగా కూడా ఎన్నోరకాల ప్రసాదాలకు అవకాశం కలిగింది. వాటిలో కొంత భాగం ఆలయ సేవకులకు, మిరాశీదారులకు పోగా సామాన్యులకు చాలా తక్కువ భాగం అందుతుండేది. మిరాశీవ్యవస్థ తొలగించిన తర్వాత ఆలయంలో ప్రసాదాల వితరణ మెరుగుపడిందనవచ్చు. దర్శన సమయాలలో ఏదో ఒక ప్రసాదం భక్తులకు అందేలా దేవస్థానం కొనసాగించడం మెచ్చుకోదగ్గఅంశం. ప్రత్యేకించి అన్న ప్రసాదాలలో పులిహోర, పొంగలి, కదంబం, చక్కెరపొంగలి మొదలైనవి భక్తులకు శుచిగా, గౌరవంగా అందివ్వడం జరుగుతుంది. స్వామి ప్రసాదాన్ని ఆలయంలో స్వీకరించడమే ధర్మం. బయట తీసుకెళ్ళేది ప్రసాదం కాదని కొందరి అభిప్రాయం. ఒకప్పుడు చిరులడ్డులు కూడా భక్తాదులకు అందుతుండేవి. స్వామి దర్శనంతో, తీర్థ స్వీకరణతో, శఠారి శాయించుకోవడంతో, హుండీలో కానుకలు అర్పించుకోవడంతో పవిత్రుడైన భక్తుడు ప్రసాదంతో సంతృప్తుడు కావడం ప్రసాదవినియోగంలోని అంతరార్థం.

**ప్రతిమామండపం:**

ప్రసాదాలు సేవించిన తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కొని ముందడగు వేస్తున్న సందర్భంలో కనిపించే మండపం ప్రతిమా మండపం. ఇక్కడ శ్రీకృష్ణదేవరాయలు దేవేరులతో చేతులు జోడించి నమస్కరిస్తున్న భంగిమ మనోజ్ఞమైనది. ఎంతవారలైనా వేంకటపతి దాసులమనే భావన కలిగిచ్చేది. అంతేగాక యాత్రలో, ఆలయ దర్శనంలో సేవా కైంకర్యాలలో ఆలయాధికారుల వల్ల ఏవైనా తెలియని పొరబాట్లు జరిగి ఉంటే వారి తరపున చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు క్షమాపణ అడుగుతున్నట్టుగా కనిపించడం ఒక విశేషం.

# అనుబంధం

1. ముఖ్యమైన టెలిఫోను నెంబర్లు

2. తిరుపతిలో యాత్రికులకు వసతి సౌకర్యాలు

3. తిరుపతిలో– తిరుపతి పరిసరాల్లో దర్శనీయ ఆలయాలు, ప్రదేశాలు

4. తి.తి.దే కల్పించే ఉచిత సౌకర్యాలు

5. తిరుమలలో యాత్రికులకు వసతి సౌకర్యాలు

6. తిరుమలలో సామాన్యభక్తులు కూడా దర్శించుకోవడానికి వీలయిన శ్రీవారి ఉత్సవాలు

7. తిరుమలలో దర్శించదగ్గ తీర్థాలు, ప్రదేశాలు

8. తిరుమలలో ముఖ్య ఉత్సావాలు

9. తిరుమల యాత్రికులకు సూచనలు

10. ఇతరాంశాలు

* * * * *



## ముఖ్యమైన టెలిఫోను నెంబర్లు

| **తిరుపతి** | **కోడ్–0877** |
|---|---|
| కార్యనిర్వహణాధికారి | 2264160 |
| సంయుక్త కార్యనిర్వహణాధికారి | 2264877 |
| ముఖ్యనిఘా&భద్రతాధికారి | 2264702 |
| పౌరసంబంధాల అధికారి | 2264561 |
| తి.తి.దే.కాల్ సెంటర్ | 2233333 |
| **తిరుమల** | |
| కార్యనిర్వహణాధికారి క్యాంప్ ఆఫీసు | 2263261 |
| జె.ఇ.ఓ. క్యాంప్ ఆఫీస్ | 2263218 |
| సి.వి&ఎస్.ఓ క్యాంప్ ఆఫీస్ | 2263304 |
| సెక్యూరిటీ టోల్ ఫ్రీ.నెం | 1800, 4254141 |
| మొబైల్ క్లినిక్ | 2264576 |
| వన్.టౌన్. పోలీస్ స్టేషన్ | 2289027 |
| టు.టౌన్. పోలీస్ స్టేషన్ | 2289031 |
| క్రైమ్ పోలీస్ స్టేషన్ | 2263423 |
| అశ్విని ఆస్పత్రి | 22636015 |
| ఫైర్ స్టేషన్ | 101 |
| సి.ఐ.పోలీస్ | 9440796799–100 |
| శ్రీవారిసేవ | 2263544 |

## తిరుపతిలో యాత్రికులకు వసతి సౌకర్యాలు

తిరుపతి తూర్పు రైల్వేస్టేషన్ వెనుకభాగంలో శ్రీగొవిందరాజస్వామి సత్రం, శ్రీకోదండరామస్వామి సత్రం, భూదేవి యాత్రిక వసతి సముదాయం శ్రీవేంకటేశ్వర అతిథిభవనం శ్రీపద్మావతి అతిథిభవనం, శ్రీనివాసం, మాధవం, విష్ణునివాసం మొదలైనవి

## తిరుపతిలో– తిరుపతి పరిసరాల్లో దర్శనీయ ఆలయాలు, ప్రదేశాలు

| | |
|---|---|
| తిరుపతి | శ్రీగోవిందరాజస్వామి ఆలయం |
| తిరుపతి | శ్రీకోదండరామస్వామి ఆలయం |
| తిరుపతి | శ్రీకపిలేశ్వరస్వామి ఆలయం |
| తిరుపతి | శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయం |
| తిరుచానూరు | శ్రీపద్మావతి అమ్మవారి ఆలయం |
| శ్రీనివాసమంగాపురం | శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయం |
| నారాయణవనం | శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయం |
| నాగలాపురం | శ్రీవేదనారాయణస్వామి ఆలయం |
| కార్వేటినగరం | శ్రీవేణుగోపాలస్వామి ఆలయం |
| వాల్మీకిపురం | శ్రీపట్టాభిరామస్వామి ఆలయం |
| తరిగొండ | శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం |
| తిరుపతిలో | ఎస్వీ మ్యూజియమ్–జంతుప్రదర్శనశాల |
| | కపిలతీర్థం జలపాతం |

## తి.తి.దే కల్పించే ఉచిత సౌకర్యాలు

తిరుపతి రైల్వేస్టేషన్ నుండి అలిపిరి దాక ఉచిత బస్సు ప్రయాణం. తిరుమలలో డార్మిటరీ సత్రంలో గదులను, ఉచిత బస్ ప్రయాణం. తిరుమలలో



ఉచిత కార్ పార్కింగ్, పాదరక్షలరక్షణకు ఉచితవసతి–తలనీలాల సమర్పణ ఉచితం. నిర్ణీతసమయాలలో 'ఉచిత దర్శన' సౌకర్యం. అశ్వినిలో ఉచితవైద్యం. వృద్ధులకు, రోగులకు నిర్ణీత సమయాల్లో దర్శన సౌకర్యం. శ్రీహరిసేవ చేయడానికి అనుమతి– ఆధ్యాత్మిక సంగీతనృత్యకార్యక్రమాల వీక్షణకు తగిన సౌకర్యాలు. మ్యూజియం సందర్శనకు ఉచితప్రవేశం. ఆలయంలో ఉచితప్రసాదం. ఆలయం వెలుపల 'నిత్యాన్నదాన పథకం' క్రింద ఉచితభోజన వసతి.

## తిరుమలలో యాత్రికులకు వసతి సౌకర్యాలు

వసతిని కేటాయించు కేంద్రములు

1. పద్మావతి అతిథిగృహముల సముదాయము, తిరుమల.
2. టి.బి.కౌంటర్, తిరుమల.
3. సి.ఆర్.ఒ. (సాధారణ), తిరుమల.
4. సి.ఆర్.ఒ. (ఉచిత), తిరుమల.
5. ఎ.ఆర్.పి.కేంద్రం, తిరుమల.
6. ఎం.బి.సి.కేంద్రం, తిరుమల.
7. శ్రీకల్యాణమండపాలు కేటాయించుకేంద్రం–రిసెప్షన్–I కార్యాలయం, తిరుమల.

## తిరుమలలో సామాన్యభక్తులు కూడా దర్శించుకోవడానికి వీలయిన శ్రీవారి ఉత్సవాలు

సాయంత్రంవేళ సహస్రదీపాలంకరణసేవ. రోజూ సాయంత్రం మాడ వీధులలో శ్రీవారి ఊరేగింపు. ప్రతిపున్నమిరోజు గరుడోత్సవం.

బ్రహ్మోత్సవాల సందర్భాలలో మాడవీధులలో శ్రీవారి ఊరేగింపు

నారాయణగిరి ఉద్యానవనంలో అన్నమయ్య జయంతి–వర్ధంతి కార్యక్రమాలు.

## తిరుమలలో దర్శించదగ్గ తీర్థాలు, ప్రదేశాలు

స్వామిపుష్కరిణి–శంఖతీర్థం–చక్రతీర్థం–జాబాలితీర్థం–పాండవతీర్థం–ఆకాశగంగ–పాపవినాశనతీర్థం– సనకసనందనతీర్థం–రామకృష్ణతీర్థం–తుంబురుతీర్థం–సుమారాధం–శేషతీర్థం

ధర్మగిరి వేద పాఠశాల–శిలాతోరణం–ఎస్వీ మ్యూజియం–అనంతాళ్వాన్ తోట మహంతు మంటపం –వెంగమాంబ బృందావనం మొదలయినవి.

## తిరుమలలో 'ముఖ్య ఉత్సవాలు'.

శ్రీపద్మావతీ శ్రీనివాసుల పరిణయోత్సవం

శ్రీవారి పవిత్రోత్సవం

శ్రీవారి శిక్యోత్సవం

శ్రీవారి బ్రహ్మోత్సవాలు

కార్తికవనభోజనోత్సవం

శ్రీవారి అధ్యయనోత్సవం

శ్రీవారి పారువేటమంటపోత్సవం

శ్రీగోదా పరిణయోత్సవం

శ్రీవారి జ్యేష్ఠాభిషేకమహోత్సవం

శ్రీవారి పుష్పయాగమహోత్సవం

## తిరుమల యాత్రికులకు సూచనలు

1. ఒక 'ప్రణాళిక' నిర్ణయించుకొని (ప్రయాణం–వసతి–సేవలు) సంబంధిత అధికారులసహాయసహకారాలతో తిరుపతికి తిరుమలకు రావాలి.

2. తిరుమలయాత్ర భక్తిసంబంధ యాత్రగానే భావించి కొనసాగించాలి.



3. తిరుమల మాడవీధులలో పాదరక్షలతో నడవకూడదని గుర్తుంచుకోవాలి.

4. సేవలకు సంప్రదాయదుస్తులు ధరించాలి.

5. అన్యమతస్థులయితే డిక్లరేషన్ ఇవ్వాలి.

6. దళారీలను నమ్మరాదు.

7. సెల్‌ఫోన్ లాంటివి ఆలయాలలో నిషిద్ధం.

8. అపరిచితులను వసతిగృహాలలో చేర్చకూడదు.

9. మధుపానాదులు నిషిద్ధం అనడాన్ని గుర్తించాలి.

10. ఇబ్బందులు కలిగిన వేళ సంబంధిత అధికారులకు ఫోన్‌ద్వారా విన్నవించాలి.

## ఇతరాంశాలు

శ్రీవేంకటేశ్వర భక్తిఛానల్ కార్యక్రమాలు, ప్రకటనల ద్వారా అనేకాంశాలు (తి.తి.దే.కు సంబంధించినవి) అవగాహన చేసుకోవాలి.

సప్తగిరి (ఆంగ్ల, హిందీ, తెలుగు, తమిళం, కన్నడం భాషలలో వెలువడే తి.తి.దే. మాసపత్రిక) ద్వారా విశేషాంశాల పరిజ్ఞానం పెంచుకోవాలి.

తి.తి.దే. విక్రయించే ఆధ్యాత్మిక సాహిత్యగ్రంథాల కొనుగోలు

తి.తి.దే. ప్రాజెక్టులకు విరాళాలు ఇవ్వడానికి తగిన అవకాశం.

తిరుపతి యాత్ర

# ఉపయుక్త గ్రంథసూచి

**తెలుగు**

అన్నమాచార్యుల జీవిత చరిత్రము – స॥వేటూరి ప్రభాకరశాస్త్రి

కొండకతలు – పేట శ్రీనివాసులురెడ్డి

తిరుమలదర్శనము – శ్వేత–తి.తి.దే.

తిరుమల సమయాచారములు – ఎన్.సి.వి.నరసింహాచార్యులు సి.ఏ.కృష్ణమాచార్యులు

వేంకటచలేతి హాసమాల – ఎన్.సి.వి.నరసింహాచార్యులు

వేంకటాచలమాహాత్మ్యము – తరిగొండ వెంగమాంబ

హరికొలువు – జూలకంటి బాలసుబ్రహ్మణ్యం

**కన్నడం**

శ్రీక్షేత్ర తిరుపతి – ఆద్య రామాచార్య

హరిదాసరు కండ శ్రీనివాస – సం॥ హెచ్.ఆర్.సత్యనారాయణరావు వై.ఎన్. గుండూరావు

**తమిళం**

తిరుమలైక్కోయిల్ ఒళుగు, వరలారుగళుం తిరువిళాక్కళుం – గణేశ్ మూర్తి

The Festivals and rituals at Tirumala temple – M.S. Ramesh

The Thirumala Temple – W. Ramesan

Thirupathi Venkateswara – Sri S.S.Sastri